సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in

# ముద్ర

హైదరాబాద్
శనివారం, 16.05.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 184
పేజీలు: 12 వెల: రూ. 5

## పట్టణాలకు భారీ ఊరట..

### సీవరేజ్ ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్

03



- 101 యూఎల్‌బీల్లో రూ.3705 కోట్ల మురుగునీటి పనులకు ఆమోదం
- స్వచ్ఛ తెలంగాణ దిశగా అడుగు..
- ఎస్బీఎం 2.0 కింద భారీ ప్రాజెక్టులు
- డ్రైనేజీ, ఎస్టీపీల నిర్మాణానికి వేగం..
- హ్యామ్ మోడల్‌లో టెండర్లు
- పట్టణ పారిశుధ్యానికి మెగా ప్లాన్..
- ఐదేళ్లు నిర్వహణ బాధ్యత కూడా సంస్థలదే



## మోదీ అతిపెద్ద యాక్షన్ ప్లాన్

### ఆరు రోజులు.. ఐదు దేశాలు..

### ప్రధాని వ్యూహాత్మక అడుగులు

- యూఏఈ పర్యటనలో చమురు దిగుమతులపై చర్చ
- టెక్నాలజీ పవర్ హౌస్ గురించి నెదర్లాండ్స్ మంతనాలు
- ఇన్నోవేషన్-రక్షణ రంగంలో అవకాశాలపై స్వీడన్లో మాటామంతి
- 43 ఏళ్ల తర్వాత నార్వే పర్యటనకు భారత ప్రధాని
- జాయింట్ స్ట్రాటజిక్ యాక్షన్ ప్లాన్ పై ఇటలీ ప్రధానితో మోదీ టాక్స్
- గ్లోబల్ డిప్లొమసీలో మోదీ మాస్టర్ ప్లాన్

**ముద్ర డెస్క్ :**
ప్రపంచ వేదికపై భారత వ్యూహాత్మక ప్రాబల్యాన్ని మరోస్థాయికి తీసుకెళ్లేందుకు ప్రధాని నరేంద్ర మోదీ సిద్ధమయ్యారు. ఆరు రోజులు ఐదు కీలక దేశాలను చుట్టిరానున్న ఈ పర్యటన ఇప్పుడు అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. కేవలం దౌత్యపరమైన పర్యటన మాత్రమే కాకుండా, చమురు భద్రత నుంచి అధునిక రక్షణ సాంకేతికత వరకు భారత్‌ను అగ్రగామిగా నిలిపే 'మాస్టర్ ప్లాన్' తో మోదీ రంగంలోకి దిగుతున్నారు.

**యూఏఈ: ఇంధన భద్రతే లక్ష్యం**
పర్యటనలో మొదటి అడుగు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో పడనుంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో, భారత్‌కు నిరంతరాయంగా చమురు దిగుమతులు అందడమే ప్రధాన లక్ష్యం. దీర్ఘకాలిక ఇంధన ఒప్పందాలతో పాటు భారీ పెట్టుబడులను ఆకర్షించడంపై దృష్టి సారించనున్నారు. మిగతా 02లో

## 2034 వరకూ

# నేనే సీఎం

### తర్వాత దేశ రాజకీయాల్లోకి..

### 'రాహుల్‌ను ప్రధాని చేస్తా'.. సీఎం రేవంత్



- మూసీ ప్రక్షాళన ఆపేది లేదు.. ఎవరు అడ్డొచ్చినా చేస్తా
- డ్రగ్స్ తీసుకునే వారి కీళ్లు ఇరగ్గొడతా
- ఆర్టీసీని లాభాల్లోకి తీసుకొచ్చాం.. నెలకు ₹350 కోట్లు ఇస్తున్నాం
- ఫ్యూచర్ సిటీ నుంచి మచిలీపట్నం వరకు కనెక్టివిటీ
- "51 శాతం మద్దతే చాలు".. రాజకీయాలపై స్ట్రైట్ కామెంట్స్
- బీఆర్ఎస్ ఇంకా భ్రమల్లోనే ఉంది
- యంగ్ ఇండియా స్కూల్స్‌తో కులాల గోడలు కూల్చేస్తాం
- ఫోన్ ఎక్కువగా వాడను.. అయినా సీఎం అయ్యా

కొడుకును విచారణకు పంపండి.. బండి సంజయ్ కు సీఎం సూచన

- వే2 న్యూస్ కాన్‌క్లేవ్‌లో రేవంత్ సంచలన వ్యాఖ్యలు

**ముద్ర డెస్క్ :**
సీఎం రేవంత్ రెడ్డి తన రాజకీయ జీవితం, తెలంగాణ భవిష్యత్, సంక్షేమం, అభివృద్ధి, డ్రగ్స్ నియంత్రణ, మూసీ ప్రక్షాళన, జాతీయ రాజకీయాలపై విస్తృత వ్యాఖ్యలు చేశారు. "2034 వరకు నేనే ముఖ్యమంత్రిగా ఉంటాను.. ఆ తర్వాత జాతీయ స్థాయిలో సేవ చేస్తాను" అంటూ స్పష్టం చేశారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్ గాంధీనే ప్రధాని అభ్యర్థి అని ప్రకటించారు.

**"అసంతృప్తే నా ఎనర్జీ"**
తనలో అసహనం, అసంతృప్తి ఉండటం వల్లే తాను ఎనర్జీగా పనిచేస్తానని సీఎం అన్నారు. సమస్యలు వచ్చినప్పుడు మానసిక ఒత్తిడి ఉంటుందని ఒప్పుకున్నా.. అదే తనను ముందుకు నడిపిస్తుందని చెప్పారు. రాజకీయాల్లో 51 శాతం మద్దతు ఉంటే చాలని, వంద శాతం అనేది అసాధ్యమని వ్యాఖ్యానించారు.

**"సంక్షేమం నిరంతర ప్రక్రియ"**
భీమవరంలో కొత్త అల్లుడికి వందల వంటకాలతో భోజనం పెట్టినా.. మరుసటి రోజు మళ్లీ టిఫిన్ అడుగుతారని, సంక్షేమం కూడా అలాంటిదేనని సీఎం వ్యాఖ్యానించారు. సంక్షేమం నిరంతర ప్రక్రియ అని.. అభివృద్ధి మాత్రం ప్రణాళికాబద్ధంగా జరగాలని చెప్పారు. గత ప్రభుత్వాలు ప్రారంభించిన పథకాలను తర్వాతి ప్రభుత్వాలు కొనసాగించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

**ఆర్టీసీపై కీలక వ్యాఖ్యలు**
ఈరోజు ఆర్టీసీని లాభాల్లోకి తీసుకొచ్చామని సీఎం తెలిపారు. ప్రతి నెల రూ.350 కోట్ల చొప్పున ప్రభుత్వం ఆర్టీసీకి అందిస్తోందని చెప్పారు. కోర్ అర్బన్ రీజియన్‌లో 2,554 బస్సులు నడుస్తున్నాయని.. ఈవీ బస్సులను తీసుకొచ్చి డీజిల్ ఖర్చు తగ్గిస్తున్నామని వెల్లడించారు.

**"తెలంగాణ రైజింగ్"పై ఫోకస్**
తన 17 ఏళ్ల ప్రతిపక్ష జీవితం సమయంలో రూపొందించుకున్న ఆలోచనలే నేటి "తెలంగాణ రైజింగ్" పాలసీ డాక్యుమెంట్‌కు పునాది అని సీఎం తెలిపారు. 108 దేశాల ప్రతినిధులతో గ్లోబల్ సమ్మిట్ నిర్వహించి తెలంగాణ పారిశ్రామిక విధానాన్ని రూపొందించామని చెప్పారు. ఓఆర్ఆర్ ఔట్ సైడ్, ఆర్ఆర్ఆర్ ఇన్‌సైడ్ ప్రాంతాన్ని భారీ పెరీ అర్బన్ ఇండస్ట్రియల్ జోన్‌గా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. మిగతా 02లో

## బెంగాల్ గడ్డపై 'యోగి' మార్క్..

### అక్రమార్కుల గుండెల్లో 'సువేందు' 'బుల్‌డోజర్' వణుకు!



- సిలిగురిలో భారీ కూల్చివేత చర్యలు
- యూపీ నుంచి రెండు డజన్ల బుల్‌డోజర్లు
- భూకబ్జాలు, డ్రగ్స్‌పై కఠిన చర్యలకు సువేందు సర్కార్ సిద్ధం

04

## కరీంనగర్‌కు మహర్దశ

### యూసీఎఫ్ కింద 3 ప్రాజెక్టులకు సూత్రప్రాయ ఆమోదం



- రూ.895 కోట్ల మంజూరు ప్రతిపాదనలకు ఓకే?
- ఫలించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కృషి
- కరీంనగర్ మేయర్ ఎన్నికల్లో హామీ ఇచ్చిన బండి
- యూసీఎఫ్ స్కీంలో కరీంనగర్ ను చేర్చాలని మోదీ, కేంద్ర మంత్రికి విజ్ఞప్తి
- కేంద్రం సానుకూల స్పందన.. ప్రతిపాదనలు పంపాలని రాష్ట్రానికి ఆదేశం
- నేడు కరీంనగర్ కు రానున్న కేంద్ర అధికారుల బృందం

06



## ఇందిరమ్మ ఇండ్ల మంజూరు నిరంతర ప్రక్రియ

### జూన్ 2న ఆదిలాబాద్ నుంచి రెండో విడత ప్రారంభం

03

- గూడులేని ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు
- జాయింట్ సర్వే తో భూ సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిష్కారం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

## సామాన్యుడిపై 'ఇంధన' పిడుగు

### పెరిగిన పెట్రో ధరలు.. ప్రతి కుటుంబ బడ్జెట్‌పై పెను భారం

### ఇంధన సెగతో నిత్యావసరాల ధరలకు రెక్కలు

## కాళేశ్వరానికి పూర్వవైభవం

### 198 కోట్లతో కాళేశ్వర క్షేత్ర పునరుద్ధరణ

- కృష్ణ శిలలతో గర్భాలయ నిర్మాణం..
- ఉజ్జయిని తరహాలో చతుర్విధ ప్రాకారాలు
- ముమ్మరంగా సాగుతున్న భూసేకరణ, ఘాట్ల విస్తరణ పనులు
- సర్వాంగ సుందరంగా ముక్తేశ్వరాలయం
- కాకతీయుల కాలం నాటి వైభవాన్ని తెచ్చేలా మాస్టర్ ప్లాన్
- ఆధ్యాత్మిక శోభతో వెలుగొందుతున్న గోదావరి తీరం
- సరస్వతి పుష్కరాల వేళ కొత్త రూపు..
- మంత్రి శ్రీధర్ బాబు దంపతుల అపర భగీరథ ప్రయత్నం



**ముద్ర, మహదేవపూర్:**
దక్షిణ కాశీగా ప్రసిద్ధి గాంచిన పవిత్ర కాళేశ్వర ముక్తేశ్వర క్షేత్రం త్వరలో శోభాయమానంగా వెలిగిపోనుంది. ప్రాచీన కాలంలో అత్యంత వైభవంగా వెలుగొందిన ఈ క్షేత్రం, కాలక్రమేణా ఎదుర్కొన్న ఇబ్బందులను అధిగమించి, ఇప్పుడు సమూల మార్పులకు సిద్ధమవుతోంది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఆయన సతీమణి, దేవదాయ మిగతా 02లో

## నా పరువును కాపాడండి

### సిటీ సివిల్ కోర్టుకు కేంద్రమంత్రి బండి సంజయ్ వినతి

- సోషల్ మీడియా, యూట్యూబ్‌లో వార్తలు ప్రసారం ఆపండి
- కోర్టు సానుకూల తీర్పు

03

**ముద్ర, పుట్టపర్తి:**
అడ్వాన్స్డ్ మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ ప్రాజెక్టు సహా వివిధ డిఫెన్సు యూనిట్లతో దేశానికి రక్షణ కవచంగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తుందని సీఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఏరోనాటికల్ డెవలప్మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలోని ఆమ్కా ప్రాజెక్టుతో ప్రధాని మోదీ ఆశిస్తున్న ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని సాధించే అవకాశం ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో ఆమ్కా ప్రాజెక్టు సహా ఇతర రక్షణ రంగ ప్రాజెక్టులకు కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. డీఆర్డీఓలో భాగమైన ఏరోనా



టికల్ డెవలప్మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలోని అడ్వాన్స్డ్ మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ ఇంటిగ్రేషన్, ఫ్లైట్ టెస్టింగ్ ప్రాజెక్టు శిలాఫలకాన్ని ఇరువురు నేతలు ఆవిష్కరించారు. మిగతా 02లో

## రాయలసీమ నుంచే 5వ జనరేషన్


# ఫైటర్ జెట్లు

### ఆత్మనిర్భర్ లక్ష్యంలో ఆమ్కా ప్రాజెక్టు ముందడుగు

- 36 రోజుల్లో జెట్ స్పీడ్ లో ఈ ప్రాజెక్టుకు అనుమతులు
- ప్రధాని మోదీ ఇచ్చిన పొదుపు ఉద్యమానికి ఏపీ సారథ్యం
- త్వరలో బంగారం ఉత్పత్తికి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్
- కేంద్ర మంత్రి రాజ్ నాథ్‌సింగ్‌తో కలిసి ఆమ్కా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన సీఎం చంద్రబాబు
- ఏపీ అంటే అడ్వాన్స్డ్ ప్రదేశ్ : రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కితాబు

**ఇదీ AI ముద్ర**

నో వెహికల్ డే సందర్భంగా ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు విజయవాడ క్యాంపు కార్యాలయం నుంచి ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం మండుటెండలో దాదాపు 10 కి.మీ. వరకు సైకిల్ తొక్కారు.






సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 16.05.2026
www.mudranews.in | @mudranews
2
జనరల్ న్యూస్
GENERAL NEWS

### వేపతో కలిగే అద్భుత ప్రయోజనాలు



చర్మ ఆరోగ్యం: వేప ఆకులలో ఉండే యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు మొటిమలు, మచ్చలను తగ్గిస్తాయి. వేప నీటితో స్నానం చేయడం వల్ల చర్మంపై ఉండే ఇన్ఫెక్షన్లు దరిచేరకుండా ఉంటాయి.

# 2034 వరకూ నేనే సీఎం..



(మొదటి పేజీ తరువాయి)

**మూసీ ప్రక్షాళన ఆపేది లేదు**

ఆక్రమణల తొలగింపు విషయంలో వెనక్కి తగ్గేది లేదని సీఎం స్పష్టం చేశారు. "యుద్ధంలో అమాయకులు చనిపోయినట్లే.. ఆక్రమణల తొలగింపులో కొంత అసంతృప్తి సహజం" అని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కూల్చివేతల వల్ల ఇబ్బంది పడిన వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు సహా సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. "ఎవరు అడ్డొచ్చినా మూసీ ప్రక్షాళన చేసి తీరుతా" అని స్పష్టం చేశారు.

**డ్రగ్స్‌పై కఠిన హెచ్చరిక**

డ్రగ్స్ నియంత్రణ కోసం ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేశామని సీఎం తెలిపారు. "డ్రగ్స్ తీసుకునే వారి కీళ్లు ఇరగ్గొడతా" అంటూ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. కొందరు సినీ ప్రముఖులు చిన్నప్పటి నుంచే తనకు తెలుసని.. ఇప్పుడు వారిలో కొందరు డ్రగ్స్ సంస్కృతిలో చిక్కుకుంటున్నారని పరోక్ష వ్యాఖ్యలు చేశారు.

**బీఆర్ఎస్, బీజేపీపై విమర్శలు**

ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇచ్చినా కూడా కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ఇంకా భ్రమల్లోనే ఉందని సీఎం విమర్శించారు. మేడిగడ్డ బ్యారేజ్ "బుర్ర లేకుండా కట్టడంతో కూలిపోయింది" అంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేయొద్దనే కోపమే కొందరిలో ఉందా అని ప్రశ్నించారు.

**విద్యా వ్యవస్థపై కాంగ్రెస్ విజన్**

దేశంలో గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు స్ట్రక్చర్డ్ విద్యా వ్యవస్థను కాంగ్రెస్ తీసుకొచ్చిందని సీఎం అన్నారు. కులాల వారీగా స్కూళ్లు నిర్మించడం అంటరానితనాన్ని ప్రోత్సహించడం కాదా అని ప్రశ్నించా రు. అందుకే "యంగ్ ఇండియా స్కూల్స్" తీసుకొస్తున్నామని.. అన్ని వర్గాల పిల్లలు కలిసి చదివేలా చేస్తామని చెప్పారు.

**జాతీయ రాజకీయాలపై క్లారిటీ**

"2034 తర్వాత కాంగ్రెస్ 100 సీట్లు గెలిచినా నేను సీఎం గా ఉండను" అని సీఎం స్పష్టం చేశారు. దేశం కోసం జాతీయ రాజకీయాల్లో పనిచేస్తానని.. రాహుల్ గాంధీని ప్రధానిగా చూడాలనేది తన లక్ష్యమని వెల్లడించారు. "ఆయనకు ఏ చైర్ వచ్చినా నేను కూర్చుంటా" అంటూ తన విధేయతను వ్యక్తం చేశారు.

**"నేను ఫోన్ ఎక్కువగా వాడను"**

ఫోన్లలో ఉపయోగం కంటే దుర్వినియోగమే ఎక్కువగా ఉందని సీఎం వ్యాఖ్యానించారు. తాను ఫోన్ ఎక్కువగా ఎత్తనని.. మెసేజ్ పెడితే చూసి తర్వాత మాట్లాడతానని చెప్పారు. "ఫోన్ వాడకపోయినా నేను ముఖ్యమంత్రినే అయ్యాను" అంటూ నవ్వులు పూయించారు.

# మోదీ పెద్ద యాక్షన్ ప్లాన్



(మొదటి పేజీ తరువాయి)

**నెదర్లాండ్స్: టెక్నాలజీ పవర్ హౌస్‌తో దోస్తీ**

ఐరోపాలో టెక్ హబ్‌గా పేరొందిన నెదర్లాండ్స్‌తో సెమీకండక్టర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగాల్లో కీలక ఒప్పందాలు జరగనున్నాయి. డిజిటల్ ఇండియాను ప్రపంచస్థాయి హైటెక్ తయారీ కేంద్రంగా మార్చేందుకు ఈ చర్చలు కీలకం కానున్నాయి.

**స్వీడన్: రక్షణ - గ్రీన్ టెక్నాలజీ**

స్వీడన్‌తో భారత్‌కు ఉన్న పాత రక్షణ బంధం ఇప్పుడు కొత్త మలుపు తిరగనుంది. టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ (సాంకేతిక బదిలీ) ద్వారా భారత్‌లోనే అధునాతన ఆయుధాల తయారీ, స్టార్టప్ రంగాల్లో స్వీడన్ పెట్టుబడులే ప్రధాన అజెండాగా సాగనుంది.

**నార్వే: 43 ఏళ్ల నిరీక్షణకు తెర**

ఈ పర్యటనలో అత్యంత విశేషం నార్వే పర్యటన. దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత ఒక భారత ప్రధాని నార్వే వెళ్తుండటం చారిత్రాత్మకం. ఆర్కిటిక్ ప్రాంతంలో పరిశోధనలు, బ్లూ ఎకానమీ (సముద్ర ఆర్థిక వ్యవస్థ), పునరుత్పాదక ఇంధన రంగాల్లో నార్వేతో చేతులు కలపనుంది.

**ఇటలీ: జాయింట్ స్ట్రాటజిక్ యాక్షన్ ప్లాన్**

పర్యటన ముగింపులో ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీతో మోదీ భేటీ కానున్నారు. ఇరు దేశాల మధ్య "జాయింట్ స్ట్రాటజిక్ యాక్షన్ ప్లాన్" ఖరారు కానుంది. రక్షణ, అంతరిక్ష పరిశోధనలు, మెడిటరేనియన్ ప్రాంతంలో భద్రతపై చర్చలు సాగనున్నాయి.

**మాస్టర్ ప్లాన్ ఎందుకు ముఖ్యం?**

ప్రస్తుతం అమెరికా–చైనా మధ్య నడుస్తున్న ప్రచ్ఛన్న యుద్ధం, మరోవైపు యూరప్‌లో మారుతున్న భద్రతా సమీకరణల మధ్య భారత్ తన స్వతంత్రతను చాటుకుంటూనే, అగ్రరాజ్యాల సరసన నిలబడాలని భావిస్తోంది. ఈ ఆరు రోజుల పర్యటన ముగిసే సమయానికి, భారత్ పలు వ్యూహాత్మక ఒప్పందాలతో అంతర్జాతీయ స్థాయిలో తన బలాన్ని మరింత సుస్థిరం చేసుకోనుంది. ప్రపంచం మొత్తం ఇప్పుడు మోదీ అడుగుల వైపు ఆసక్తిగా చూస్తోంది!

# రాయలసీమ నుంచే 5వ జనరేషన్ ఫైటర్ జెట్లు

(మొదటి పేజీ తరువాయి)

త్రివిధ దళాలకు రక్షణ ఉత్పత్తులను తయారు చేయనున్న కల్యాణీ స్ట్రాటజిక్ సిస్టమ్స్ ఆధ్వర్యంలోని ఆగ్నేయాస్త్ర ఎనర్జిటిక్స్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్, హెచ్ఎఫ్ సీఎల్ ప్రాజెక్టుల శిలాఫలకాలను కేంద్ర మంత్రితో కలిసి సీఎం ప్రారంభించారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లులోని డ్రోన్ సిటీలో ఏర్పాటు కానున్న 5 డ్రోన్ తయారీ, టెక్నాలజీ కంపెనీలను కూడా వర్చువల్ గా శంకుస్థాపన చేశారు.




అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.."సత్యసాయి బాబా బోధనలతో ఈ ప్రాంతం నుంచి విశ్వ శాంతికి బాటలు పడ్డాయి. ఇప్పుడు పుట్టపర్తిలో ఏరోనాటికల్ డెవలప్మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో అడ్వాన్స్డ్ మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ ప్రాజెక్టు రావటం ఎంతో కీలకంగా మారింది. దేశం గర్వించే వ్యూహాత్మకమైన రక్షణ కేంద్రంగా పుట్టపర్తి మారుతుంది. ఆమ్కా ప్రాజెక్టుతో ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యసాధనలో ఏపీ ముఖ్యపాత్ర పోషిస్తుంది. భారత రక్షణ రంగాన్ని ఆధునీకరించటంతో పాటు బలోపేతం చేయటంపై ప్రధాని దృష్టి సారించారు. ఆధునిక తరం స్టెల్త్ యుద్ధ విమానాలను తయారు చేసేలా AMCA ప్రాజెక్టు ఏర్పాటు అవుతోంది. భారత రక్షణ శక్తిని ప్రపంచానికి చాటటంలో ఆపరేషన్ సింధూర్ ఓ ప్రత్యక్ష ఉదాహరణ. ఆపరేషన్ సింధూర్ లో వినియోగించిన డ్రోన్లు ఏపీలోనే తయారై, టెస్ట్ చేశారు. AMCA లాంటి ప్రాజెక్టును ఏపీకి కేటాయించినందుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ధన్యవాదాలు. రూ.15 వేల కోట్లకు పైగా పెట్టుబడితో 7,500 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే ప్రాజెక్టు వస్తుంది. ఫైటర్ జెట్ ఇంటిగ్రేషన్‌తో పాటు ఫ్లైట్ టెస్టింగ్ కేంద్రంగా పుట్టపర్తి మారుతుంది. అత్యంత వేగంగా ఈ ప్రాజెక్టును సాకారం చేయటంలో రక్షణ శాఖ, కేంద్ర ప్రభుత్వ సహకారం అందించాయి." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**రోజుల వ్యవధిలోనే అమ్కా ప్రాజెక్టు సాకారం**

"కేవలం 36 రోజుల్లోనే ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయగలిగామని.. జెట్ స్పీడ్‌తో అనుమతులిచ్చామని సీఎం వివరించారు. ఏరోస్పేస్ రంగంలో కీలకమైన ఈ ప్రాజెక్టుతో పాటు మరికొన్ని డిఫెన్సు ప్రాజెక్టులు కూడా వస్తున్నాయి. భారత్ ఫోర్జ్, హెచ్ఎఫ్ సీఎల్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్, కర్నూలు జిల్లాలో డ్రోన్ సిటీలకు శంకుస్థాపన చేశాం. ఇటీవల యుద్ధాల్లో డ్రోన్లే కీలకంగా మారాయి. వ్యవసాయం నుంచి చాలా రంగాల్లో డ్రోన్ల వినియోగం పెరిగింది. ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటు చేసి ఉత్పత్తి చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. శ్రీహరికోట అంతరిక్ష శక్తి, నాగాయలంకలో క్షిపణిశక్తి, పుట్టపర్తి రక్షణ శక్తి, విశాఖ నుంచి నౌకాదళ శక్తితో మొత్తం దేశానికే రక్షణ కవచంగా ఏపీ నిలుస్తుంది. కూటమి అధికారంలోకి వచ్చాకే రాయలసీమకు నీరిచ్చి లక్ష కోట్లతో హార్టికల్చర్ హబ్ గా మారుస్తున్నాం. రాయలసీమలో ఇనుప ఖనిజం, సున్నపురాయి లాంటి ఖనిజ వనరుల్ని సమర్ధంగా వినియోగించుకుంటాం. కడప స్టీల్ ప్లాంటు 2027, డిసెంబరు నాటికి పూర్తి చేస్తాం. స్టీల్, సిమెంట్ ప్లాంట్లు, సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులకు సీమ కేంద్రంగా మారుతుంది. డిఫెన్స్, స్పేస్ , ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్ లాంటి పరిశ్రమలతో రాయలసీమ రతనాల సీమగా మారుస్తాం. కొప్పర్తి పారిశ్రామిక నోడ్ ఎలక్ట్రానిక్స్ తయారీ హబ్‌గా మారుతుంది. తిరుపతిలో రాయల్ ఎన్‌ఫీల్డ్ ప్లాంట్, శ్రీహరికోట సమీపంలో స్పేస్ సిటీ ఏర్పాటు చేస్తాం. కియా పరిశ్రమ ఏటా 18 లక్షల కార్లు తయారు చేస్తోంది. కరవు సీమలో తయారైన కార్లు 80 దేశాల్లో తిరుగుతున్నాయి. రాయలసీమలోని ఆర్డీటీ సంస్థకు విదేశీ విరాళాల విషయంలో సమస్య ఉత్పన్నం అయితే కేంద్రంతో మాట్లాడి మంత్రి లోకేష్ ఆ సమస్యను పరిష్కరించారని" సీఎం వెల్లడించారు.

**గతంలో కేజీఎఫ్ ఇప్పుడు జేజీఎఫ్**

"త్వరలో కర్నూలు జిల్లా జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్ నుంచి బంగారం ఉత్పత్తి జరుగుతుంది. JGFలో ఈ ఏడాది 600 కేజీల బంగారం ఉత్పత్తి అవుతుంది. రెండో ఏడాది 1,500 కిలోల బంగారం తయారవుతుంది. రానున్న రోజుల్లో బంగారం ఉత్పత్తికి ఏపీ కీలకంగా మారుతుంది. సమర్థవంతమైన నీటి నిర్వహణతో జలాశయాలు నీటితో కళకళలాడుతున్నాయి. అభివృద్ధిని బుల్లెట్ స్పీడ్ తో తీసుకెళ్తున్నాం. అవకాశాలు తెచ్చే బాధ్యత మాది. వాటిని అందిపుచ్చుకునే బాధ్యత యువతది. గత పాలనలో విధ్వంసం చేశారు. పరిశ్రమలు తరిమేశారు. సాగునీటి రంగాన్ని నిర్లక్ష్యం చేశారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో మళ్లీ ఏపీ బ్రాండ్‌ను పునరుద్ధరించాం. 23 నెలల్లో 23 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం. వీటివల్ల 24 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. యువతకు ఇక్కడే ఉద్యోగాలు రావాలి, ఇతరులకూ ఇక్కడే ఉపాధి కల్పించేలా పరిశ్రమలు వస్తున్నాయి. గూగుల్, ఆర్సెలార్ మిత్తల్ లాంటి ప్రాజెక్టులు వచ్చాయి. రిలయన్స్, బీపీసీఎల్ లాంటి ప్రాజెక్టులు వస్తాయి. విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రంగా మూడు ఎకనామిక్ రీజియన్లలో పెట్టుబడులు వస్తాయి. చిప్ నుంచి షిప్ వరకూ మన దేశంలోనే తయారు కావాలని ప్రధాని మోదీ పిలుపు ఇచ్చారు. ఏపీలో డిజైన్ చేయండి, పెట్టుబడులు పెట్టండి, ఉత్పత్తులు తయారు చేయండి అని పారిశ్రామిక వేత్తల్ని కోరుతున్నాను. పారిశ్రామికాభివృద్ధిలో భాగంగా ఏపీలో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం... వేగంగా అనుమతులు ఇస్తున్నాం. దేశానికి తిరుగులేని శక్తిగా రాయలసీమ, ఆంధ్రప్రదేశ్ తయారవుతాయి." అని ముఖ్యమంత్రి వివరించారు.

**నాదేశం- నాబాధ్యత**

"పశ్చిమాసియాలో యుద్ధ ప్రభావం మనపై కూడా పడిందని...ఇంధనం, బంగారం కొనుగోలుతో విదేశీ మారక నిల్వలు తరిగిపోతున్నాయని సీఎం అన్నారు. దేశానికి ఆర్థిక భద్రత కూడా అత్యంత కీలకమని.. ఇతర దేశాలు కూడా పొదుపు చర్యలు చేపట్టాయని తెలిపారు. ప్రధాని మోదీ ఇచ్చిన 7 అంశాలను ఆచరిద్దాం. పొదుపు చర్యల్లో భాగంగా కాన్వాయ్ లో వాహనాల సంఖ్యను తగ్గించుకున్నాం. దీనిపై ఓ కార్యాచరణను కూడా తీసుకువచ్చాం. వర్క్ ఫ్రమ్ హోం లాంటి అంశాలను అమల్లోకి తీసుకురావాలని కోరుతున్నాను. ప్రతీ భారతీయుడూ ప్రస్తుత సవాళ్లను అవకాశాలుగా మలచుకోవాలి. ప్రధాని మోదీ ఇచ్చిన పొదుపు ఉద్యమానికి ఏపీ సారధ్యం వహించాలని" ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

**ఏపీ ఇక అడ్వాన్స్ డ్ ప్రదేశ్- రాజ్ నాథ్ సింగ్**

అమ్కా ప్రాజెక్టు ఏపీ సహా దేశ రక్షణలో ఓ చారిత్రాత్మక అధ్యాయాన్ని జోడిస్తోందని కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. గూగుల్ లాంటి ఐటీ దిగ్గజ కంపెనీలతో పాటు రక్షణ రంగ పరిశ్రమల్ని ఆకర్షిస్తున్న ఏపీ పేరు అడ్వాన్స్డ్ ప్రదేశ్ అని కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు. 5 జనరేషన్ ఆధునిక స్టెల్త్ యుద్ధ విమానాల్ని తయారు చేస్తున్న రాయలసీమను మిలటరీ ఇండస్ట్రియల్ కాంప్లెక్సుగా అభివృద్ధి చేయాలని ఆయన సూచించారు. రూ.15 వేల కోట్ల విలువైన పెట్టుబడితో ఎయిర్ క్రాఫ్ట్ ఇంటిగ్రేషన్ తో పాటు ఆధునిక ఫ్లైట్ టెస్టింగ్ సెంటర్ ను కూడా ఏర్పాటు చేస్తున్నామని ఇలాంటి ఫ్లైట్ టెస్టింగ్ కేంద్రాలు కేవలం కొద్దిదేశాల వద్ద మాత్రమే ఉన్నాయని.. ఇప్పుడు భారత్ కూడా ఆ సరసన చేరిందని అన్నారు. అమ్కా ప్రాజెక్టుతో తయారైన ఆధునిక యుద్ధ విమానాలు మన రక్షణ శక్తిని చాటేలా మన గగనశక్తిని చాటేలా పుట్టపర్తి నుంచి టేకాఫ్ అవుతాయని కేంద్ర మంత్రి వివరించారు. ఆ తరహా యుద్ధ విమానాలను పుట్టపర్తి నుంచి తయారు చేయబోతున్నామని తెలిపారు. భారత్ డైనమిక్స్ లిమిటెడ్ కూడా రూ.480 కోట్లతో ఆధునిక అటానమస్ అండర్ వాటర్ వ్యవస్థలను, టార్పెడోలను ఉత్పత్తి చేస్తుందన్నారు. ఇప్పటి వరకూ దిగుమతి చేసుకుంటున్న చాలా పరికరాలను కూడా స్వదేశీయంగా తయారు చేసుకోగలమని చెప్పారు.

**7 సంస్థలతో ఒప్పందాలు**

అంతకు ముందు రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్, సీఎం చంద్రబాబు సమక్షంలో 7 సంస్థలు ఎంఓయూలు కుదుర్చుకున్నాయి. రూ. 4460 కోట్ల పెట్టుబడులు, 6400 మందికి ఉద్యోగాలు కల్పించేలా ఈ ఒప్పందాలు కుదిరాయి. భారత్ ఫోర్జ్, రఘువంశీ మెషీన్ టూల్స్, సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్ , ఎన్ఐబీఈ గ్రూప్, పీఎంటీ డిఫెన్స్, చక్రవ్యూహ్ డైనమిక్స్, ఇండస్ బ్రిడ్జ్ వెంచర్స్ సంస్థలు ఈ ఎంఓయూలు కుదుర్చుకున్నాయి. శంకుస్థాపన కార్యక్రమానికి ముందు ఆమ్కా ప్రాజెక్టులో నిర్మితం కానున్న అడ్వాన్స్డ్ మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ నమూనాతో పాటు భారత్ డైనమిక్స్ సహా వేర్వేరు సంస్థలు ఏర్పాటు చేసిన మిస్సైళ్లు, హ్యాండ్ గ్రెనేడ్ లు, టార్పెడో నమూనాలు, ఆధునిక తుపాకుల ప్రదర్శనను కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్ తో కలిసి సీఎం తిలకించారు. శంకుస్థాపనల కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్, కేంద్ర మంత్రి రామ్మోహన్నాయుడు, మంత్రులు టీజీ భరత్, సత్యకుమార్ యాదవ్, అనగాని సత్య ప్రసాద్, సవిత, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఏపీ సలహాదారు సతీష్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.







# కాళేశ్వరానికి పూర్వవైభవం



(మొదటి పేజీ తరువాయి)

శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్ కాళేశ్వర క్షేత్ర పునరుద్ధరణకు నడుం బిగించారు.

**రూ. 198 కోట్లతో బృహత్తర ప్రణాళిక**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం కాళేశ్వరాలయ అభివృద్ధి కోసం 198 కోట్ల రూపాయలను కేటాయించింది. ఈ నిధులతో ఆలయ రూపురేఖలను పూర్తిగా మార్చేలా ప్రణాళికలు రూపొందించారు. ప్రస్తుతం ఉన్న గర్భగుడిని, శుభానంద దేవి ఆలయాన్ని కృష్ణ శిలలతో (రాతితో) పునర్నిర్మించనున్నారు. ఉజ్జయిని మహాకాళేశ్వర ఆలయ తరహాలో ఇక్కడ కూడా నాలుగు వైపులా ప్రాకారాలను పునరుద్ధరిస్తున్నారు. క్షేత్రస్థాయిలో భూసేకరణ పూర్తి చేసి, అత్యాధునిక బస్టాండ్, విశాలమైన పార్కింగ్ స్థలాలు, భక్తుల సౌకర్యార్థం గోదావరి తీరంలో ఘాట్ల విస్తరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

**పుష్కరాల వేళ 'గోదావరి హారతి'**

సరస్వతి నది ఆది పుష్కరాలను పురస్కరించుకుని కాశీ పండితులతో అత్యంత వైభవంగా గోదావరి హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. నూతనంగా 'సరస్వతి ఘాట్'ను నిర్మించడంతో పాటు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్ పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

**చారిత్రక నేపథ్యం - పునరుద్ధరణ పరంపర**

కాళేశ్వర క్షేత్రానికి ఘనమైన చరిత్ర ఉంది. కాకతీయ చక్రవర్తి గణపతిదేవుని మంత్రి గంగాధరుడు ఈ క్షేత్రాన్ని పునరుద్ధరించినట్లు నగునూరు శాసనం ద్వారా తెలుస్తోంది. 1978 లో మంథని ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో దివంగత ప్రధాని పీవీ నరసింహారావు, అప్పటి మంత్రి జువ్వాడి చొక్కారావు ఆధ్వర్యంలో ఒక కమిటీని వేసి, శృంగేరి శంకరాచార్యుల సలహాతో ఆలయాన్ని పునరుద్ధరించారు. ఆ సమయంలోనే తిరుమల తిరుపతి దేవస్థానం, వేములవాడ దేవస్థానాల సహకారంతో సత్రాలు, రాజగోపురం నిర్మించారు.

**అంకితభావంతో శ్రీధర్ బాబు దంపతులు**


ఒకవైపు మంత్రిగా శ్రీధర్ బాబు నిధుల సేకరణ, క్షేత్ర ప్రచారంపై దృష్టి సారించగా, మరోవైపు శైలజ రామయ్యర్ తన పరిపాలనా దక్షతతో పనులను నాణ్యతతో పూర్తి చేయిస్తున్నారు. సరస్వతి, గోదావరి పుష్కరాలనే లక్ష్యంగా చేసుకొని ఈ క్షేత్రాన్ని దక్షిణాదిలోనే గొప్ప శైవ క్షేత్రంగా తీర్చిదిద్దుతుండటం పట్ల భక్తులు, పండితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శనివారం 16.05.2026
www.mudranews.in | @mudranews



**వేపతో కలిగే అద్భుత ప్రయోజనాలు**

జుట్టు సంరక్షణ: వేప నూనె లేదా వేప ఆకుల మిశ్రమాన్ని తలకు పట్టించడం వల్ల చుండ్రు సమస్య పూర్తిగా నయమవుతుంది. ఇది జుట్టు రాలడాన్ని తగ్గించి, కుదుళ్లను బలంగా మార్చడంలో సహాయపడుతుంది.



## ఉపాధిహామీ చట్టాన్ని తీసివేస్తే
# మోడీ పతనం తప్పదు
### వ్యకాస రాష్ట్ర కార్యదర్శి నారీ ఐలయ్య



**ముద్ర, నల్గొండ :** ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేస్తే కేంద్రంలోని మోదీ ప్రభుత్వ పతనం తప్పదని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారీ ఐలయ్య హెచ్చరించారు. శుక్రవారం దేశవ్యాప్త గ్రామీణ సమ్మెలో భాగంగా నల్గొండ జిల్లా చిట్యాల మండలంలోని నేరడ, ఉరుమడ్ల, పెద్దకాపర్తి గ్రామాల్లో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో ఉపాధి హామీ చట్టం కీలక పాత్ర పోషించిందని ఆయన తెలిపారు. చెరువుల పూడికతీత, గట్ల నిర్మాణం, కాలువలు, గ్రామీణ రహదారులు వంటి అభివృద్ధి పనులు ఈ చట్టం ద్వారానే సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. అయితే ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచే కుట్రలో భాగంగానే కొత్తగా "వీబీజీ రాంజీ" బిల్లును తీసుకువస్తున్నారని ఆరోపించారు. అలాగే ఫోటో క్యాప్చర్ విధానాన్ని రద్దు చేసి ఉపాధి సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, ఉపాధి హామీ పథకానికి పూర్తి నిధులు కేంద్ర ప్రభుత్వమే భరించాలని నారీ ఐలయ్య డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు డాక్టర్ కల్లూరు కుమారస్వామి ఫీల్డ్ అసిస్టెంట్లు మల్లేశం. రమేష్. వడ్డె గాని రాధా కార్మిక సంఘం నేరడ గ్రామం అధ్యక్షులు ఐతరాజు లావణ్య కార్యదర్శి వల్లపు పద్మ పెద్ద కాపర్తి గ్రామ అధ్యక్షులు ఏర్పుల దామోదర్ కార్యదర్శి బడే లావణ్య ఉరుమట్ల గ్రామ అధ్యక్షులు గురజా లావణ్య కార్యదర్శి ఉడుగు లీలావతి సంఘ నాయకులు సాగర్ల మాధవి.వరికుప్పల మంజుల. చిలువేరు సైదమ్మ. రాపోలు మాధవి ఏర్పుల మల్లేశ్వరి. మంత్రి వెంకటమ్మ. పొట్లపల్లి సావియా. సిరిసి యాదయ్య. గుండెబోయిన శిల్ప. ఆమనగంటి అలివేలు. తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల మంజూరు నిరంతర ప్రక్రియ
### రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి
### పొంగులేటి శ్రీనివాస రెడ్డి




**ముద్ర, తెలంగాణ బ్యూరో :** గూడులేని ప్రతి అర్హ పేద కుటుంబానికి సొంత ఇల్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని, జూన్ 2న ఆదిలాబాద్ జిల్లా నుంచి రెండో విడత కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని వెల్లడించారు. పేదలకు సొంత ఇల్లు అనేది కేవలం నివాసం మాత్రమే కాకుండా వారి ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, రెవెన్యూ, హౌసింగ్, ఫారెస్టు శాఖ అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు. తొలి విడతలో 3 లక్షలకు పైగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని, వాటిలో సుమారు 2.90 లక్షల ఇండ్లకు గ్రౌండింగ్ పూర్తైందన్నారు. ఇప్పటికే 50 వేల గృహ ప్రవేశాలు జరిగాయని, మరో రెండు లక్షలకు పైగా ఇండ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు.ప్రతి నియోజకవర్గానికి 3500 ఇండ్లు మంజూరు చేయగా, ఐటిడిఏ ప్రాంతాలకు అదనంగా ఇండ్లు కేటాయించినట్లు చెప్పారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఇల్లు అందించే వరకు మూడో, నాలుగో విడతలుగా కూడా ఈ కార్యక్రమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఇందిరమ్మ పథకం కింద సహాయం పొందిన వారికి కూడా కొత్తగా ఇండ్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ఫారెస్ట్ అధికారులు, సింగరేణి యాజమాన్యం అడ్డంకులు కల్పించవద్దని సూచించారు. ఇండ్ల బేస్‌మెంట్ కోసం చెరువులు, కుంటల నుంచి మట్టి తరలింపునకు రెవెన్యూ, పోలీస్ శాఖలు సహకరించాలని కలెక్టర్లకు ఆదేశించారు. వివిధ నిర్మాణ దశల్లో ఉన్న 2బిహెచ్‌కే ఇండ్లకు ఈ నెలాఖరులోపు లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలని స్పష్టం చేశారు.రాష్ట్రంలో ముఖ్యంగా ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో రెవెన్యూ–ఫారెస్ట్ సరిహద్దు వివాదాలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొంటూ, రెండు శాఖలు జాయింట్ సర్వే నిర్వహించి శాశ్వత పరిష్కారం చూపాలని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వం కొనుగోలు చేసిన రోవర్స్ ద్వారా భూ వివాదాల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## పర్సంటేజ్ విధానంపై కమిటీ
### 15 మందితో ప్రకటించిన తెలుగు తెలంగాణ ఫిలిం ఛాంబర్
### నిర్మాతలు-ఎగ్జిబిటర్ల సమస్యపై కీలక నిర్ణయం
### రెండు నెలల్లో నివేదిక ఇవ్వనున్న కమిటీ

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** తెలుగు చిత్ర పరిశ్రమలో నిర్మాతలు, థియేటర్ ఎగ్జిబిటర్ల మధ్య సమస్య తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో తెలుగు తెలంగాణ ఫిలిం ఛాంబర్ కీలక నిర్ణయం తీసుకుంది. పర్సంటేజ్ విధానంపై కమిటీ ఏర్పాటు చేసింది. 15 మందితో కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో ఎగ్జిబిటర్స్, డిస్ట్రిబ్యూటర్స్, నిర్మాతలకు చోటు కల్పించింది. కమిటీలో ఒక్కో విభాగం నుంచి ఐదుగురుని నియమించారు. 2 నెలల్లో నివేదిక ఇవ్వాలని కమిటీకి సూచించారు. నిర్మాతలు, థియేటర్ ఎగ్జిబిటర్ల మధ్య పర్సంటేజ్ వివాదం తలెత్తడంతో ఈ సమస్యల పరిష్కారానికి తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ రంగంలోకి దిగింది. ఛాంబర్ అధ్యక్షుడు డి.సురేష్ బాబు ఆధ్వర్యంలో శుక్రవారం ఇరు వర్గాల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. వాడీవేడీగా జరిగిన ఈ సమావేశంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు.

# ట్రిలియన్ ఎకానమీ లక్ష్యం

### రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
### తొగర్‌పల్లిలో భారీ ఫుడ్ ఇండస్ట్రీకి భూమిపూజ




**ముద్ర, తెలంగాణ బ్యూరో :** తెలంగాణ రైజింగ్‌తో త్రీ ట్రిలియన్ ఎకానమీ లక్ష్యంగా రాష్ట్ర మంత్రివర్గమంతా పనిచేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. జహీరాబాద్ ప్రాంతంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం తొగర్‌పల్లిలో మంత్రి శ్రీధర్‌బాబు, మంత్రి దామోదర రాజనర్సింహ కలిసి రూ.650 కోట్ల పెట్టుబడితో 44 ఎకరాల్లో నిర్మించనున్న భారీ ఫుడ్ ఇండస్ట్రీకి భూమిపూజ చేశారు.ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాల్గొన్నారు. కేజేఎస్ యూనిట్–2 ద్వారా 1500 మంది స్థానిక మహిళలకు ఉపాధి కల్పించడమే లక్ష్యమని తెలిపారు.మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ తొగర్‌పల్లిలో ఇంత పెద్ద పరిశ్రమ ఏర్పాటుకు నిర్మలా జగ్గారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి కృషి కారణమని చెప్పారు. ఈ పరిశ్రమ పూర్తిగా కాలుష్య రహితమని, స్థానిక యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. సీఎం అనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షిస్తున్నామని తెలిపారు. 2047 నాటికి దేశ జాతీయ ఉత్పత్తిలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలోనే మొదటి పరిశ్రమలు సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో ఏర్పడ్డాయని గుర్తు చేశారు. వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమలు వస్తే స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు.టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లాకు బీహెచ్‌ఈఎల్, బీఎఇఎల్, ఓడిఎఫ్ వంటి కేంద్ర సంస్థలను తీసుకువచ్చామని తెలిపారు. ఈ కొత్త పరిశ్రమ ద్వారా మహిళలకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు.

# ప్రతిపక్ష ఓట్లనే బీజేపీ టార్గెట్ చేస్తోంది
### టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు బండి సంజయ్ కుమార్, జి. కిషన్ రెడ్డి దొంగ ఓట్లతోనే గెలిచారని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ఎస్ఐఆర్ పేరిట దేశంలోని 14 రాష్ట్రాల్లో ఓట్ల చోరీ జరిగిందని, దీనికి పశ్చిమ బెంగాల్ ఎన్నికలే నిదర్శనమని పేర్కొన్నారు. తెలంగాణలో ఓటర్ల జాబితాలో అక్రమాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల అధికారులను కోరారు.దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎస్ఐఆర్ మూడో దశ నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో మహేశ్ కుమార్ గౌడ్ నేతృత్వంలోని ఎంపీలు, ఎమ్మెల్యేల బృందం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డిను కలిసి వినతిపత్రం అందజేసింది. అనంతరం మీడియాతో మాట్లాడుతూ బీజేపీకి అనుకూలంగా లేని ఓట్లను జాబితా నుంచి తొలగించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు.ఎస్ఐఆర్ ప్రక్రియను ఏడాది పొడవునా దశలవారీగా నిర్వహించాలని, బీఎల్‌ఓలు కనీసం మూడు సార్లు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని డిమాండ్ చేశారు. గుర్తింపు పొందిన పార్టీలకు 2002, 2025 ఓటర్ల జాబితాల సాఫ్ట్, హార్డ్ కాపీలు ఇవ్వాలని, అభ్యంతరాలకు కనీసం నెలరోజుల గడువు కల్పించాలని సూచించారు. ఓటు తొలగింపుకు ముందు తప్పనిసరిగా వ్రాతపూర్వక నోటీసు ఇవ్వాలని కోరారు.ఫారమ్–7 ద్వారా ఓట్ల బల్క్ తొలగింపులను అరికట్టాలని, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, పేద వర్గాల ఓట్లు తొలగిపోకుండా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. 2002 తర్వాత తెలంగాణకు వలస వచ్చి కనీసం రెండు ఎన్నికల్లో ఓటు వేసిన వారికి అఫిడవిట్ ఆధారంగా ఓటు హక్కు కల్పించాలని, నిబంధనలు ఉల్లంఘించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### పెట్రో ధరల పెంపుతో మోయలేని భారం

పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి కేంద్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలపై మరో భారం మోపిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. శుక్రవారం హైదరాబాద్ లో మీడియాతో మాట్లాడారు. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గుతున్నాయన్న దేశంలో మాత్రం పెట్రోల్ రేట్లను పెంచి కేంద్రం దోచుకుంటోందని ఆరోపించారు. మోదీ ప్రభుత్వ చర్యలతో రవాణా ఖర్చులు పెరిగి అన్ని వస్తువుల ధరలపై ప్రభావం పడుతుందన్నారు. చివరకు సామాన్యుడు నష్టపోతాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు హామీలు ఇచ్చిన బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్ సంస్థలకు మేలు చేసే విధానాలకే పరిమితమైందని విమర్శించారు. ప్రజా సంక్షేమం కంటే పన్నుల వసూళ్లపైనే మోదీ ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు.


### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
### టిమ్స్ తో ప్రజలకు చేరువగా ప్రపంచ స్థాయి వైద్యం

# కేసీఆర్ ది హెల్త్ విజన్



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** హైదరాబాద్ ప్రజలకు ప్రపంచ స్థాయి వైద్య సదుపాయాలను చేరువ చేయాలనే సంకల్పంతోనే కేసీఆర్ ప్రభుత్వం టిమ్స్ హాస్పిటల్స్‌కు అంకురార్పణ చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పారు. గతంలో కేవలం గాంధీ, ఉస్మానియా ఆస్పత్రులపైనే భారం ఉండేదన్న ఆయన నేడు అంతర్జాతీయ ప్రమాణాలతో టిమ్స్ అందుబాటులోకి వచ్చిందన్నారు. శుక్రవారం సనత్‌నగర్ 'టిమ్స్' నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన ఆస్పత్రి ప్రత్యేకతలు, గత ప్రభుత్వ కృషిని వివరించారు. మొత్తం 22 ఎకరాల విశాలమైన ప్రాంగణంలో 'టిమ్స్' నిర్మాణం జరిగిందని చెప్పారు, దాదాపు రూ.1,200 కోట్ల వ్యయంతో అత్యాధునిక హంగులతో తీర్చిదిద్దినట్లుగా వెల్లడించారు. 300 ఐసీయూ బెడ్లతో సహా వేలాది మందికి చికిత్స అందించే సదుపాయం ఉందన్నారు. 16 ఆపరేషన్ థియేటర్లు, ఎంఆర్ఐ, సీటీ స్కాన్ వంటి డయాగ్నస్టిక్ సౌకర్యాలు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కిడ్నీ సంబంధిత వ్యాధులపై ప్రత్యేక పరిశోధన కేంద్రాలు, రీసెర్చ్ బ్లాక్స్ కూడా ఏర్పాటు చేశారని తెలిపారు. నగరంలోని సనత్‌నగర్, ఎల్‌బీ నగర్, ఆల్వాల్ ప్రాంతాల్లో 'టిమ్స్' ఏర్పాటు చేశామని వివరించారు. వరంగల్‌లో 2వేల పడకలతో మరో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణంలో ఉందని కేటీఆర్ గుర్తు చేశారు. నిమ్స్ విస్తరణతో పాటు రాష్ట్రవ్యాప్తంగా 350 బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేసి వైద్య వ్యవస్థను ప్రజల వద్దకు తీసుకెళ్లామని వివరించారు. కేసీఆర్ ప్రభుత్వం కొనసాగి ఉంటే 'టిమ్స్' ఆసుపత్రి రెండేళ్ల క్రితమే పూర్తయ్యేదన్నారు. మిగిలి ఉన్న పనులను ప్రస్తుత ప్రభుత్వం వెంటనే పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. రోగుల బంధువుల కోసం ధర్మశాల, వెయ్యి కార్ల పార్కింగ్, ఎమర్జెన్సీ ర్యాంప్ వంటి సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు.

# సీవరేజ్ ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్
### 101 పట్టణాల్లో భారీగా అమలు
### రూ.3705.75 కోట్ల పనులకు ఆమోదం



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** తెలంగాణలో 101 యూఎల్‌బీల్లో భారీ సీవరేజ్ ప్రాజెక్టులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు సంబంధించి రూ.3705.75 కోట్ల పరిపాలనా అనుమతులకు ఆమోదం తెలుపుతూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్రం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ భారత్ మిషన్ 2.0 (ఎస్బీఎం 2.0) కింద సీవరేజ్ ప్రాజెక్టులకు టెండర్లకు అనుమతిస్తున్నట్లు ఓ ప్రకటనలో పేర్కొంది. మొత్తం 101 పట్టణాలను 3 వేర్వేరు ప్యాకేజీలుగా విభజించి టెండర్లు పిలవాలని నిర్ణయించారు. దీనివల్ల పెద్ద కంపెనీలు పోటీ పడే అవకాశం లభిస్తుంది. సాధారణంగా భూసేకరణ పూర్తయ్యాక టెండర్లు పిలవాలి. కానీ ఈ ప్రాజెక్టుకు ప్రాధాన్యం ఎక్కువగా ఉండటంతో.. కొన్నిచోట్ల భూసేకరణ ప్రక్రియ పెండింగ్ లో ఉన్నా, టెండర్లను మాత్రం ఎక్కడా ఆపకుండా తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఇదే సమయంలో మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణానికి అవసరమైన భూసేకరణను వేగవంతం చేయాలని స్పష్టం చేసింది. ప్రాజెక్టుల కింద కేవలం డ్రైనేజీ నెట్వర్క్, ఎస్టీపీల నిర్మాణం మాత్రమే కాకుండా వాటిని నిర్మించిన సంస్థే ఐదేళ్ల పాటు ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ నిర్వహణ బాధ్యతలను కూడా చూసుకోవాల్సి ఉంటుంది.

# హైస్పీడ్ రైలు కనెక్టివిటీ ప్రతిపాదనలు సిద్ధం చేయండి
### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** ముంబై, చెన్నై, బెంగళూరుకు హైస్పీడ్ రైలు కనెక్టివిటీ ప్రతిపాదనలు కేంద్ర రైల్వేశాఖతో కలిసి సిద్ధం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆదేశించారు. హైస్పీడ్ రైలు కారిడార్లపై శుక్రవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. తెలంగాణ రైజింగ్ 2047కు హైస్పీడ్ రైల్ ప్రాజెక్టులు కీలకమని చెప్పిన ఆయన పారిశ్రామిక, ఐటీ, పర్యాటక రంగాలకు ఈ ప్రాజెక్ట్‌తో ప్రయోజనకరమని తెలిపారు. హైదరాబాద్ – పూణే – ముంబై కారిడార్‌లకు 671 కిలోమీటర్ల మార్గానికి ప్రతిపాదనలు రెడీ చేయాలని, తెలంగాణలో 93 కిలోమీటర్ల మేర భూసేకరణ అవసరమని తెలిపారు. హైదరాబాద్–బెంగళూరు, చెన్నై కారిడార్లకు 123 కిలోమీటర్ల భూసేకరణ కావాలని హెచ్‌ఎండిఏ, జీఎంఆర్, రైల్వేశాఖల సమన్వయంతో ప్రాజెక్టు అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. భూసేకరణ, కనెక్టివిటీ, మౌలిక వసతులపై చర్యలకు ఆదేశాలు జారీ చేశారు.

### నా పరువును కాపాడండి

**సోషల్ మీడియా లో పరువు నష్టం కలిగించే వార్తల ప్రసారం ఆపండి**
**సిటీ సివిల్ కోర్టుకు కేంద్రమంత్రి బండి సంజయ్ వినతి**
**కోర్టు సానుకూల తీర్పు**



**ముద్ర, తెలంగాణ బ్యూరో:** కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించారు. తనపై మీడియా, సోషల్ మీడియా, యూట్యూబ్‌లో పరువు నష్టం కలిగించేలా వార్తలు ప్రసారం చేస్తున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. తన కుమారుడు భగీరథ్ పోక్సో కేసుతో పాటు తనపైన దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో తన పేరు, ఫొటోలు, వీడియోలు వాడొద్దంటూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తన పేరుతో ఇప్పటి వరకు సోషల్ మీడియాలో, యూట్యూబ్ ఛానళ్లలో ఉన్న వీడియోలను తొలగించాలని కోర్టును కోరారు. తన ప్రతిష్టకు భంగం కలిగేలా ప్రచారం జరుగుతోంద ని న్యాయస్థానానికి వివరించారు. ఈ క్రమంలో సోషల్ మీడియా, యూట్యూబ్, మీడియాలో వచ్చిన కథనాలను వెంటనే తొలగించాలని సిటీ సివిల్ కోర్టు ఆదేశించింది. తదుపరి ఆదేశాల వరకు ఎలాంటి కథనాలు ప్రసారం చేయొద్దని న్యాయస్థానం స్పష్టం చేసింది. యూట్యూబ్, సోషల్ మీడియాలో బండి సంజయ్‌కి వ్యతిరేకంగా ఉన్న పోస్టులను వెంటనే తొలగించాలని సిటీ సివిల్ కోర్టు ఆదేశించింది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 16.05.2026
www.mudranews.in | @mudranews



### వేపతో కలిగే అద్భుత ప్రయోజనాలు

దంత సంరక్షణ: పూర్వం నుండి వేప పుల్లలను బ్రష్‌గా వాడటం వల్ల చిగుళ్ల వ్యాధులు, పంటి నొప్పి రాకుండా ఉంటాయి. ఇది నోటిలోని హానికర బ్యాక్టీరియాను అంతం చేసి నోటి దుర్వాసనను పోగొడుతుంది.



# సామాన్యుడిపై 'ఇంధన' పిడుగు

**పెరిగిన పెట్రో ధరలు.. ప్రతి కుటుంబ బడ్జెట్‌పై పెను భారం**

**ముద్ర డెస్క్ :** అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు సెగలు ఇప్పుడు సామాన్యుడి వంటింట్లోకి చేరుతున్నాయి. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు లీటర్‌కు సగటున రూ.3 వరకు పెరగడం కేవలం వాహనదారులకే కాదు.. ప్రతి మధ్యతరగతి కుటుంబానికి ఒక పెద్ద 'ఆర్థిక షాక్'. ఇప్పటికే నిత్యావసరాల ధరలతో సతమతమవుతున్న సామాన్యుడిపై ఈ తాజా పెరుగుదల 'గోరుచుట్టుపై రోకటి పోటు'లా మారింది.

**ప్రమాద గంటికలు మోగిస్తున్న రవాణా ఛార్జీలు**

ఇంధన ధరల పెరుగుదల ప్రభావం నేరుగా రవాణా రంగంపై పడుతుంది. డీజిల్ ధర పెరిగితే సరుకు రవాణా చేసే లారీలు, వ్యాన్‌ల యజమానులు తమ ఛార్జీలను పెంచక తప్పదు. దీనివల్ల నిత్యావసరాలైన పాలు, కూరగాయలు, గుడ్లు, మాంసం వంటి రోజువారీ వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతాయి. రైతుల నుంచి మార్కెట్‌కు, మార్కెట్ నుంచి రిటైల్ దుకాణాలకు సరుకు చేరేలోపు రవాణా ఖర్చు రెట్టింపు అవ్వడంతో ఆ భారాన్ని అంతిమంగా వినియోగదారుడే మోయాల్సి వస్తుంది.

**ప్రజా రవాణా.. ప్రయాణం ఇక భారమే!**

చదువు కోసం వెళ్లే విద్యార్థులు, ఉద్యోగాల కోసం తిరిగే సామాన్యులు ఇప్పుడు ప్రయాణ ఖర్చుల లెక్కలు వేసుకోవాల్సి వస్తోంది. ఆటో ఛార్జీలు, క్యాబ్‌లు, ప్రైవేట్ బస్సుల ఛార్జీలు పెరగడం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటికే పెరిగిన మెట్రో ఛార్జీలతో సతమతమవుతున్న




నగరవాసులకు, తాజా పెట్రో ధరల పెరుగుదల అదనపు భారం. ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థలు కూడా 'ఫ్యూయల్ సర్ఛార్జ్' పేరుతో డెలివరీ ఛార్జీలను పెంచే అవకాశాలు ఉన్నాయి.

**రైతన్నపై అదనపు భారం**

దేశానికి వెన్నెముక అయిన రైతుపై ఈ ప్రభావం మరింత తీవ్రంగా ఉండనుంది. సాగు పనులకు వాడే ట్రాక్టర్లు, నీటి మోటార్లు, పంట కోత యంత్రాలన్నీ డీజిల్‌తోనే నడుస్తాయి. ఇప్పటికే ఎరువులు, విత్తనాల ధరలు పెరగడంతో సతమతమవుతున్న రైతుకు, ఇప్పుడు సాగు, రవాణా వ్యయం పెరగడం పెద్ద దెబ్బ. ఇది చివరకు పంటల ధరల పెరుగుదలకు దారితీసి మళ్ళీ సామాన్యుడి భోజనపు పళ్లెంపైనే ప్రభావం చూపుతుంది.

**నిర్మాణ రంగం.. కలల ఇల్లు కష్టమేనా?**

సిమెంట్, ఇసుక, ఇనుము వంటి నిర్మాణ సామగ్రిని భారీ వాహనాల్లో రవాణా చేస్తారు. డీజిల్ ధరల ప్రభావంతో ఈ వస్తువుల ధరలు ఒక్కసారిగా పెరుగుతాయి. దీనివల్ల సామాన్యుడి సొంతింటి కల మరింత వ్యయప్రయాసలతో కూడుకున్నదిగా మారనుంది. కాంట్రాక్టర్లు, డెవలపర్లు ఈ అదనపు వ్యయాన్ని ప్రాజెక్ట్ ధరల్లో కలిపే అవకాశం ఉంది.

**మధ్యతరగతి 'పొదుపు' మంత్రం**

జీతాలు పెరగవు కానీ ఖర్చులు మాత్రం రెక్కలు కట్టుకుని ఎగురుతున్నాయి. ఈ నేపథ్యంలో మధ్యతరగతి కుటుంబాలు తమ ఆర్థిక ప్రణాళికలను మార్చుకుంటున్నాయి. అనవసర ప్రయాణాలకు స్వస్తి పలకడం... వ్యక్తిగత వాహనాల కంటే ప్రజా రవాణా లేదా కార్‌పూలింగ్ వైపు మొగ్గు చూపడం... వినోదం, బయట భోజనాల వంటి ఖర్చులను తగ్గించుకోవడం వంటి చర్యలు చేపడుతున్నారు.


**అనిశ్చితిలో సామాన్యుడు**

అంతర్జాతీయంగా రష్యా–ఉక్రెయిన్ లేదా మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు తగ్గకపోతే ముడి చమురు ధరలు మరింత పెరిగే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వం పన్నుల తగ్గింపు ద్వారా ఉపశమనం కలిగించకపోతే.. సామాన్యుడి ఆర్థిక పరిస్థితి మరెంత దారుణంగా మారుతుందోనని జనం భయపడుతున్నారు. "సంపాదన స్థిరం.. ఖర్చు అస్థిరం" అన్నట్లుగా తయారైంది ప్రస్తుత పరిస్థితి.

## మాతా శిశు ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం

**- బాలింత శరీరంలో కాటన్ మరిచిపోయి కుట్లు వేసిన వైనం**
**- వైద్యుల నిర్లక్ష్యంపై కుటుంబ సభ్యుల అగ్రహం**





**ముద్ర, తాండూర్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలోని హైదరాబాద్ రోడ్డు మార్గంలో గల మాత శిశు సంరక్షణ ఆసుపత్రిలో డెలివరీ కోసం వచ్చే రోగుల పట్ల వైద్యులు చెలగాటమాడుతున్నారు. తాజాగా ఒక సంఘటన వెలుగులోకి వచ్చింది బషీరాబాద్ మండలం డబల్ గ్రామానికి చెందిన పార్వతీ అనే గర్భిణి తన భర్తతో కలిసి మే 3న మాతా శిశు ఆసుపత్రిలో చేరింది. ఆమెకు వైద్యులు నార్మల్ డెలివరీ చేశారు. ఆ గర్భిణీకి మొదటి కాన్పు కావడం వల్ల కాన్పు సమయంలో శరీరంలో కాటన్ అలాగే పెట్టి కుట్లు వేశారు. ఆస్పత్రి నుండి డిశ్చార్జ్ అయిన వారం రోజుల తర్వాత గర్భిణి తీవ్ర అనారోగ్యానికి గురి అయింది. దీంతో ఆమె కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు ఆ గర్భిణికి వైద్య పరీక్షలు నిర్వహించగా కడుపులో నుండి కాటన్ ఉందని గమనించి బయటకు తీశారు. శరీరంలో కాటన్ అలాగే ఉండడం వల్ల ఇన్ఫెక్షన్ తీవ్రతరం అయి జ్వరం రావడంతో ఆ కుటుంబ సభ్యులు మళ్లీ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. వైద్యుల నిర్లక్ష్యంపై కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో వైద్యులు తమకేమి తెలవదు అన్నట్లుగా వ్యవహరించి ఆ గర్భిణీ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో కోపోద్రిక్తులైన కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ కు తీసుకెళ్లారు. ఈ ఘోర నిర్లక్ష్యానికి కారణమైన ఆసుపత్రి వైద్యురాలు, సిబ్బందిపై తక్షణమే విచారణ జరిపి బాధ్యులైన వారందరి పైన కఠినమైన చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## డిజిటల్ హెల్త్ కార్డుల ప్రారంభానికి సన్నాహాలు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ 2వ తేదీ డిజిటల్ హెల్త్ కార్డులను లాంఛనంగా ప్రారంభించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల్లో, డైరెక్టరేట్ స్థాయిల్లో కూడా జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ మీటింగ్ లను ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ మీటింగ్ శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో సీఎస్ అధ్యక్షతన జరిగింది. ఉద్యోగులకు సంబంధించి పీఆర్సీ నివేదిక, హెల్త్ కార్డులు, పెండింగ్ బిల్లుల చెల్లింపులు, సర్వీస్ అంశాలు, ఉద్యోగుల బదిలీలు, 317 జీవో బదిలీలు, ఇతర అంశాలను సమావేశంలో చర్చించారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన వివిధ సమస్యలను వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు ఈ సందర్భంగా సమావేశంలో ప్రస్తావించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ... పీఆర్సీ నివేదిక వీలైనంత త్వరలో తెప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఆ దిశలో కమిషన్ కూడా తీవ్రంగా కృషి చేస్తోందన్నారు. ఈ సమావేశంలో ప్రస్తావించిన ఆర్థికేతర అంశాలను వీలైనంత మేరకు పరిష్కరించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో స్పెషల్ సీఎస్ మహేశ్ దత్ ఎక్కా, సవ్యసాచిఘోష్, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానీయా, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ యోగితారాణా, వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా చొంగ్తు, టీఎన్‌జీవో అధ్యక్షులు మారం జగదీశ్వర్, టీజీవో అధ్యక్షులు ఏలూరి శ్రీనివాస రావు, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## స.హ.చట్టంతో పారదర్శకత, జవాబుదారీతనం

**రాష్ట్ర సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి**

**ముద్ర, నిజామాబాద్:** ప్రభుత్వ యంత్రాంగంపై ప్రజలకు విశ్వాసాన్ని కల్పిస్తూ, పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించడమే సమాచార హక్కు చట్టం ముఖ్య ఉద్దేశ్యమని రాష్ట్ర సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్ డాక్టర్ జి.చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రధాన సమావేశ మందిరంలో శుక్రవారం సమాచార హక్కు చట్టం – 2005 పై పీఐఓలకు, ఏపీఐఓలకు, అన్ని శాఖల అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు రాష్ట్ర సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేయగా, సమాచార కమిషనర్లు పీ.వీ.శ్రీనివాస్ రావు, దేశాల భూపాల్ లు హాజరయ్యారు. జిల్లా పాలనాధికారి ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా చీఫ్ కమిషనర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య దేశంలో సమాచారం అందుబాటులో ఉంటేనే ప్రజలకు ఉపయోగమని, ప్రజలు కోరిన సమాచారాన్ని వారికి తెలియజేసే బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కును సమాచార హక్కు చట్టం ద్వారా కల్పించబడిందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆయన సమాచార హక్కు చట్టంలోని 2 షెడ్యూళ్ళు, 6 చాప్టర్లు, 31 సెక్షన్ల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. సమాచార హక్కు చట్టం దరఖాస్తులకు సంబంధించి పీ.ఐ.ఓలు, ఏ.పీ.ఐ.ఓల సందేహాలను నివృత్తి చేశారు. పౌరులు కోరినప్పుడే సమాచారం ఇవ్వడం కాకుండా, సమాచార హక్కు చట్టం, సెక్షన్ 4(1)బి ప్రకారం స్వచ్ఛందంగా సమాచారం ఇచ్చేలా అధికార యంత్రంగాలు సమాయత్తం కావాలని సూచించారు. మరో 15వేల వరకు అప్పీల్స్ రాష్ట్ర సమాచార కమిషన్ కు వస్తున్నాయని వివరించారు. ఇప్పటివరకు 20 జిల్లాలలో రాష్ట్ర సమాచార కమిషన్ పర్యటించిందని, సుదీర్ఘ కాలం నుండి పెండింగ్ లో ఉన్న పాత కేసులు అన్నింటిని పరిష్కరించడం జరిగిందని అన్నారు. రాష్ట్ర సమాచార కమిషనర్ దేశాల భూపాల్ మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం అమలు భారతదేశంలో అమలు చేస్తున్న వివరాలు తెలియజేస్తూ అధికార యంత్రంగాలు, పిఐఓలు సమాచార హక్కు చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. 1766 లోనే స్వీడన్ దేశంలో సమాచార హక్కు చట్టం అమలు ప్రారంభమైందని, 2005 సంవత్సరంలో భారతదేశంలో ఈ చట్టం అమల్లోకి వచ్చినట్లు వెల్లడించారు. సమాచార కమిషనర్ పీ.వీ.శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం అమలు, ఉద్దేశ్యాలు, 4(1)బి కింద ఇచ్చే సమాచారం తెలియజేస్తూ ఎప్పటికప్పుడు రిజిస్టర్లలో వివరాలను అప్డేట్ చేయాల్సిన బాధ్యత అధికార యంత్రాంగాలపై ఉందని సూచించారు. ఈ సందర్భంగా పలు పెండింగ్ కేసులను ఆర్.టీ.ఐ కమిషన్ చీఫ్ కమిషనర్, కమిషనర్లు పరిశీలించి పరిష్కరించారు. కాగా, సదస్సుకు హాజరైన రాష్ట్ర సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డికి, కమిషనర్లు దేశాల భూపాల్, పీ.వీ.శ్రీనివాస్ రావులకు కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఇతర జిల్లా అధికారులు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. సదస్సులో అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, దిలీప్ కుమార్, డీ.ఎఫ్.ఓ సిద్ధార్థ్ విక్రం సింగ్, అదనపు డీ.సీ.పీ ప్రకాశ్, డీ.ఆర్.ఓ బి.గీత, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.




## ఈతకు వెళ్లి ఇద్దరు విద్యార్థులు మృతి

**ముద్ర ప్రతినిధి, మెదక్:** ఈత సరదా ఇద్దరి ప్రాణాలు తీసిన సంఘటన మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం హకీంపేట వద్ద శుక్ర వారం చోటు చేసుకుంది. మాసాయిపేట గ్రామానికి చెందిన జాలనంద కిషోర్ (15), నాగోల్ల భాను (15) అనే విద్యార్థులు ఈతకు వెళ్లి నీటి గుంతలో పడి చనిపోయారు. విషయం తెలిసిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసు లు గజ ఈతగాళ్ల సాయంతో శివాలయం నీటి గుంత నుండి వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## బెంగాల్ గడ్డపై 'యోగి' మార్క్..

**- అక్రమార్కుల గుండెల్లో 'సువేందు' 'బుల్‌డోజర్' వణుకు!**
**సిలిగురిలో భారీ కూల్చివేత చర్యలు**

**ముద్ర డెస్క్ :** పశ్చిమ బెంగాల్‌లో కొత్త రాజకీయ వాతావరణం వేగంగా మారుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం సువేందు అధికారి వరుస కీలక నిర్ణయాలతో పాలనలో దూకుడు పెంచుతున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఆయన.. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అమలు చేస్తున్న "బుల్‌డోజర్ మోడల్"ను ఇప్పుడు బెంగాల్‌లోనూ ప్రవేశపెడుతున్నారనే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది.

ప్రభుత్వం ఏర్పడిన కొన్ని రోజులకే అక్రమ నిర్మాణాలపై భారీ స్థాయిలో చర్యలు ప్రారంభించడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ముఖ్యంగా సిలిగురి ప్రాంతంలో ప్రభుత్వ భూములు, చెరువులు, కాలువలు, జలవనరులపై ఏర్పడిన అక్రమ కట్టడాలను గుర్తించిన ప్రభుత్వం.. వాటి కూల్చివేతకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఇప్పటికే బుల్‌డోజర్లు రంగంలోకి దిగి పలు నిర్మాణాలను నేలమట్టం చేస్తున్నాయి. దీంతో "యోగీ మార్క్ పాలన" ఇప్పుడు బెంగాల్‌లో మొదలైందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

ఈ చర్యలకు డార్జిలింగ్ ఎంపీ రాజు బిస్తా పూర్తి మద్దతు ప్రకటించారు. అక్రమ నిర్మాణాలను ఏ పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ఆయన స్పష్టం చేశారు. ఈ క్రమంలో ఉత్తరప్రదేశ్ నుంచి రెండు డజన్లకు పైగా బుల్‌డోజర్లను తెప్పిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో చట్టపరమైన పాలనను బలపరచడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

సిలిగురిలో ఇటీవల జరిగిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో శాంతిభద్రతలు, భూకబ్జాలు, డ్రగ్స్ నియంత్రణ, అక్రమ మద్యం దుకాణాలు, అనధికార బార్‌ల తొలగింపు వంటి అంశాలపై విస్తృత చర్చ జరిగింది. ముఖ్య అధికారులు, పోలీసు విభాగం ప్రతినిధులు పాల్గొన్న ఈ సమావేశంలో కఠిన చర్యలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా నగర పరిధిలో విస్తరించిన



అక్రమ నిర్మాణాలపై స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని నిర్ణయించారు.

ఈ సందర్భంగా ఎంపీ రాజు బిస్తా మాట్లాడుతూ.. సిలిగురిలో గత కొన్నేళ్లుగా అక్రమ నిర్మాణాలు విపరీతంగా పెరిగాయని ఆరోపించారు. స్థానిక మున్సిపాలిటీ పాలకులు, అధికారులు తమ బాధ్యతలు నిర్వర్తించడంలో విఫలమయ్యారని విమర్శించారు. ఈ విషయంలో త్వరలోనే అధికారులను వివరణ కోరనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ భూములపై ఎలాంటి ఆక్రమణలు సహించబోమని, చెరువులు మరియు జలవనరులను పూర్తిగా కాపాడుతామని స్పష్టం చేశారు.

బీజేపీ ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీశాయి. ఒకవైపు ప్రభుత్వం "అక్రమాలపై యుద్ధం"గా ప్రచారం చేస్తుండగా.. మరోవైపు ప్రతిపక్షాలు మాత్రం దీనిని రాజకీయ లక్ష్యాలతో చేస్తున్న చర్యలుగా విమర్శిస్తున్నాయి. అయినప్పటికీ ప్రజల్లో క్రమశిక్షణ, చట్ట పరిరక్షణ, భూకబ్జాల నిర్మూలన అంశాలపై ప్రభుత్వం కఠిన వైఖరి అవలంబిస్తోందనే భావన బలపడుతోంది.

దీంతో ఇకపై పశ్చిమ బెంగాల్‌లో కూడా యూపీ తరహా కఠిన పాలన కొనసాగుతుందా..? "యోగీ ఫార్ములా"నే సువేందు ప్రభుత్వం అమలు చేస్తుందా..? అన్న చర్చ రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

# చికెన్ సెంటర్ పై దాడి


**చికెన్ సెంటర్ , రెండు ఇళ్లలో చొరబడి విధ్వంసం**

**ముద్ర, కోరుట్ల;** కోరుట్ల పట్టణంలో అర్ధరాత్రి చోటుచేసుకున్న దాడి ఘటన తీవ్ర కలకలం రేపింది. పట్టణంలోని వినోబా రోడ్డులో గల సారధి చికెన్ సెంటర్ నిర్వాహకుడు బలరాం కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకొని నలుగురు వ్యక్తులు గురువారం రాత్రి 10 నుండి 11 గంటల మధ్య సమయంలో చొరబడి కత్తులతో బెదిరిస్తూ షాపు, రెండు ఇళ్లలోకి వెళ్ళి భారీ విధ్వంసానికి పాల్పడినట్లు



బాధితులు ఆరోపిస్తున్నారు. బాధితుల కథనం ప్రకారం 25 సంవత్సరాలుగా నడిపిస్తున్న దుకాణం మూసివేయాలంటూ గత కొద్ది రోజులుగా బెదిరింపులు వస్తున్నాయని, ఇదే రోడ్డులో ఎన్నో చికెన్, మటన్ సెంటర్లు ఉండగా మా ఒక్క షాపునే ఎందుకు టార్గెట్ చేస్తున్నారని

ప్రశ్నించగా "షాపు మూసేయాలి" అంటూ బెదిరింపులకు దిగారు. ముందుగా మూసివున్న చికెన్ సెంటర్ సెట్టర్ నీ పగులగొట్టి లోపల ఫర్నిచర్, ఫ్రీజర్లు, ఇతర ఎక్యుప్మెంట్స్ ధ్వంసం చేసిన దుండగులు, అనంతరం షాపు వెనుక ఉన్న ఇంటిలోకి చొరబడి ఇంటి సామాన్లను ధ్వంసం చేసినట్లు తెలిపారు. అంతటితో ఆగకుండా కొంత దూరంలో ఉన్న మరో ఇంటిని కూడా లక్ష్యంగా చేసుకున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో భారీ రాళ్లతో గేటు తాళాలు పగులగొట్టారు., తరువాత ఇంటి తలుపులు ధ్వంసం చేసి లోపలికి ప్రవేశించి ఇంట్లో ఉన్న బియ్యం, పప్పు, ఉప్పు వంటి నిత్యావసర సరుకులతో పాటు టీవీలు, ఫ్యాన్లు, ఫర్నిచర్, ఇతర గృహోపకరణాలను కూడా ధ్వంసం చేశారని బాధితులు వాపోయారు. రెండు ఇళ్లలోనూ వస్తువులను చెల్లాచెదురుగా పడేసి భయానక పరిస్థితి సృష్టించినట్లు బాధితులు తెలిపారు. భయాందోళనకు గురైన కుటుంబ సభ్యులు



వెంటనే డయల్ 100కు సమాచారం అందించగా పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. అయితే పోలీసులు వెళ్లిన కొద్దిసేపటికే మళ్లీ వచ్చి దాడికి పాల్పడ్డారని బాధితులు ఆరోపిస్తున్నారు.

**"మాకు న్యాయం చేయండి" అంటూ తల్లి కన్నీటి విజ్ఞప్తి**

బాధితుడు బలరాం తల్లి కన్నీటి పర్యంతమై మాట్లాడుతూ "మా కొడుకుకు చిన్నపిల్లలు ఉన్నారు. కష్టపడి చికెన్ షాపు నడుపుకుంటూ బతుకుతున్నాం. మా ఇళ్లలో, షాపు లోని ఉన్న సామాన్లు అన్నీ పగులగొట్టారు. పోలీసులు మాకు న్యాయం చేయాలి..." అంటూ వేడుకుంది. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించినట్లు సమాచారం.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 16-05-2026
www.mudranews.in | @mudranews



## వేపతో కలిగే అద్భుత ప్రయోజనాలు

### రోగనిరోధక శక్తి

ప్రతిరోజూ కొన్ని లేత వేప ఆకులను పరగడుపున నమలడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇది రక్తాన్ని శుద్ధి చేసి, రక్త ప్రసరణను మెరుగు పరుస్తుంది.



## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కొనసాగింపు

**ముద్ర, మల్కాజిగిరి:** మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న డిగ్రీ ఆన్లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) ద్వారా రెండవ దశ ప్రవేశాల కోసం నమోదు ప్రారంభమైనట్లు కళాశాల అధికారులు తెలిపారు. విద్యార్థులు మే 25వ తేదీ లోపు అధికారిక వెబ్సైట్లో నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రవేశాల ఎంపిక సమయంలో 12090 కోడ్ కలిగిన మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఎంపిక చేసుకోవాలని కోరారు. ఈ కళాశాలలో బీఎస్సీ, బీకాం, బీఏ వంటి కోర్సులతో పాటు ఆధునిక అవసరాలకు అనుగుణంగా ఆన్లైన్ కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయని దోస్త్ సమన్వయకర్త డా అడవి రాజు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బండి రాజు మాట్లాడుతూ ప్రవేశాల ప్రక్రియలో విద్యార్థులకు ఎటు వంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు వేసవి సెలవుల్లో కూడా సిబ్బంది కార్యాలయంలో అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం దోస్త్ సహాయకులు 9966911448, 9440867068, నంబర్లను సంప్రదించాలని తెలిపారు. విద్యార్థులు చివరి తేదీకి ముందే నమోదు పూర్తి చేసి తమకు నచ్చిన కోర్సులను ఎంపిక చేసుకోవాలని అధికారులు సూచించారు.

## బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేయాలి



**ముద్ర, కాప్రా:** ఉప్పల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. పాత హబ్సిగూడ డివిజన్ ఆధ్వర్యంలో ఇందిరా ఎంపిరియల్ లో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ మెంబర్‌షిప్ సన్నాహక సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. పార్టీకి ప్రజల్లో ఉన్న ఆదరణను మరింత పెంచేందుకు సభ్యత్వ నమోదు కార్యక్రమం కీలకమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో స్థానిక నాయకులు, మాజీ డివిజన్ అధ్యక్షులు, యువ నాయకులు, మహిళా నాయకులు పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సేవా భావాన్ని చాటుకున్న డాక్టర్ సంపత్ కుమార్

**ముద్ర, తాండూర్ ప్రతినిధి:** వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణానికి చెందిన బాలాజీ నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ సంపత్ కుమార్ మరో సరి సేవ భావాన్ని చాటుకున్నారు. తాండూ రు మండలం అంతారం గ్రామానికి చెందిన తాంద్ర బాలప్ప అకాల మరణం చెందడంతో ఆ నిరుపేద కుటుంబానికి అంత్యక్రియల కోసం డాక్టర్ సంపత్ కుమార్ రూ.3 వేలు అందజే శారు. ఈ కార్యక్రమంలో అంతా రం గ్రామానికి చెందిన వార్డు మెంబర్స్, సేరి విలాస్ రెడ్డి, మంబాపూర్ వీజేందర్, మ్యాతారి ప్రవీణ్ కుమార్, ప్రకాష్, ఎల్లప్ప, వెంకటప్ప, తాంద్ర రమేష్ తదితరులు ఉన్నారు.

## సంగమేశ్వర దేవాలయ అభివృద్ధికి సహకరిస్తా..

### - ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి



**ముద్ర, తాండూర్ ప్రతినిధి:** తాండూర్ నియోజకవర్గం లోని యాలాల్ మండలం కోకట్ గ్రామ శివారు నుండి సంగమేశ్వర దేవాలయం వరకు రూ.2.38 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన సిసి రోడ్డును ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంగమేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధికి అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు అధికారులు ఆలయ కమిటీ సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** నాగర్‌కర్నూల్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తాడూర్, తెల్కపల్లి మండలాలకు చెందిన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రతి వర్గానికి ఆర్థిక భద్రత కల్పించే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా పేద కుటుంబాల కుమార్తెల వివాహాలకు ఆర్థిక సహాయం అందిస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నామన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ రమణ రావు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్, తాడూర్ మండల అధ్యక్షుడు యారా రమేష్, తెల్కపల్లి మండల అధ్యక్షుడు బండా పర్వతాలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా గోవులను తరలిస్తే కఠిన చర్యలు

### - ఎస్సై వెంకటేష్ గౌడ్

**ముద్ర, పెబ్బేరు:** రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా పెబ్బేరు పట్టణ, మండల పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా గోవులు, దూడలు, ఇతర పశువులను అక్రమంగా అమ్మడం, కొనుగోలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై వెంకటేష్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతి లేకుండా గోవులను తరలించడం తెలంగాణ గోవధ నిషేధం, పశు సంరక్షణ చట్టం, 1977 ప్రకారం చట్ట రీత్యా నేరమని ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి గోవుల అక్రమ రవాణా, వధ లేదా విక్రయాలకు పాల్పడిన వారిపై సంబంధిత చట్టా ప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. పశువులను తరలించే వారు తప్పనిసరిగా సంబంధిత అనుమతి పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. బక్రీద్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పెబ్బేరు పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక పోలీస్ బందోబస్తు, వాహన తనిఖీలు, రాత్రి గస్తీ నిర్వహించబడతాయని తెలిపారు. ప్రజలు శాంతి భద్రతలను కాపాడుతూ పరస్పర మత సామరస్యాన్ని పాటించాలని, అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను ఎస్ఐ కోరారు.

# చెంచుల అభివృద్ధికి టీజీఐఎల్పీ కీలకం

### - కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని మల్లాపూర్ పెంట గ్రామాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, చెంచు గిరిజన కుటుంబాల జీవనోపాధి మెరుగుదలకు తెలంగాణ ఇన్‌క్లూజివ్ లైవ్లీహుడ్స్ ప్రోగ్రామ్ (టీజీఐఎల్పీ)ను సమర్థంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. అత్యంత పేదరికంలో ఉన్న 34 చెంచు కుటుంబాలతో సమావేశమై వారి ఉపాధి, ఆరోగ్యం, విద్య, తాగునీరు వంటి సమస్యలను తెలుసుకున్నారు. ప్రతి కుటుంబానికి ప్రత్యేక జీవనోపాధి ప్రణాళికలు రూపొందించి పశుపోషణ, కోళ్ల పెంపకం, అటవీ ఉత్పత్తుల ఆధారిత ఉపాధి వంటి రంగాల్లో శిక్షణలు ఇవ్వాలని సూచించారు. మహిళల ఆర్థిక సాధికారత, యువతకు నైపుణ్యాభివృద్ధి, గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అన్ని సంక్షేమ పథకాలు అర్హులైన చెంచు కుటుంబాలకు చేరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ చిన్న ఓబులేష్, అచ్చంపేట ఆర్డీవో యాదగిరి, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సతీషన్ సారథ్యంలోనే కేరళం అభివృద్ధి సాధ్యం

### - రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి



**ముద్ర, హైద్రాబాద్:**

కాబోయే ముఖ్యమంత్రి వీ.డి. సతీషన్ సారథ్యంలో కేరళం రాష్ట్రం ఎంతో అభివృద్ధి సాధిస్తుందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి అన్నారు. కేరళం ముఖ్యమంత్రి అభ్యర్థిగా సతీషన్ పేరును ఏఐసీసీ ప్రకటించడం గొప్ప విషయమని చిన్నారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సీఎల్పీ లీడర్ గా ప్రతిపక్షంలో సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించిన సతీషన్ పరావర్ అసెంబ్లీ స్థానం నుంచి వరుసగా ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారని చిన్నారెడ్డి తెలిపారు. ఏఐసీసీ కార్యదర్శి హోదాలో సతీషన్, తాను తమిళనాడు రాష్ట్రంలో సౌత్, నార్త్ ప్రాంతాల ఇన్చార్జిలుగా 2012 నుంచి 2015 వరకు కలిసి బాధ్యతలు నిర్వహించామని చిన్నారెడ్డి గుర్తు చేశారు. కేరళ మహాత్మా గాంధీ యూనివర్సిటీ విద్యార్థి సంఘం చైర్మన్ గా, ఎన్ ఎస్ యు ఐ, యూత్ కాంగ్రెస్, ప్రదేశ్ కాంగ్రెస్ లలో సతీషన్ పలు బాధ్యతలు నిర్వహించారని, హైకోర్టు న్యాయవాదిగా రాణించారని చిన్నారెడ్డి పేర్కొన్నారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ, ఏఐసిసి ప్రెసిడెంట్ మల్లికార్జున ఖర్గే, లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ఎంపీ ప్రియాంక గాంధీ, కేరళం సీఎం అభ్యర్థి సతీషన్ లకు చిన్నారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

### - కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:**

జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి, ఒప్పందం ప్రకారం సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ఇంజనీరింగ్ శాఖల సమీక్ష సమావేశంలో పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, పబ్లిక్ హెల్త్, విద్య, వైద్య తదితర శాఖల పరిధిలో కొనసాగుతున్న నిర్మాణ పనుల పురోగతిని ఆయన సమీక్షించారు. ఎంపీ నిధులతో చేపట్టిన పనులను రెండు నెలల్లో పూర్తి చేయాలని సూచించారు. అలాగే రూసా, నాబార్డ్, నేషనల్ హెల్త్ మిషన్, సీఎస్ఆర్ నిధులతో చేపట్టే పనులు పెండింగ్‌లో ఉండకుండా టెండర్లు పూర్తి చేసి కాంట్రాక్టర్లతో ఒప్పందం మేరకు పనులు చేయించాలన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, మెడికల్ కళాశాల భవనాలు, పీఎం శ్రీ నిధులతో చేపట్టే లైబ్రరీలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, పాఠశాల మరుగుదొడ్లు, అంగన్వాడీ భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. క్వాలిటీ కంట్రోల్, ఎంబీలు, రికార్డులు పక్కాగా నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, వివిధ శాఖల ఈఈలు, డీఈలు, ఏఈఈలు పాల్గొన్నారు.

# ఇసుక రవాణాకు ఆన్‌లైన్ అనుమతులు ఇవ్వాలి

### - కలెక్టర్ సీహెచ్ ప్రియాంక



**ముద్ర, నారాయణపేట:**

జిల్లాలో గుర్తించిన పది ఇసుక రీచ్‌ల నుంచి "మన ఇసుక – మన వాహనం" విధానంలో ఆన్‌లైన్ అనుమతులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గోటూరు, సమస్తాపూర్, నాగిరెడ్డిపల్లి, ఓబులాపురం-1,2, దాసర్ దొడ్డి, వడ్వాట్, అడవి సత్యారం, అమ్మపల్లి తదితర రీచ్‌ల నుంచి ఇసుక రవాణాకు అనుమతులు ఇవ్వాలని సూచించారు. ఇసుక రీచ్‌ల వద్ద సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయాలని, బుకింగ్ జరిగిన వెంటనే ఇసుక త్వరగా డెలివరీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల కలెక్టర్ ఆదేశాల మేరకు భూగర్భ జలవనరులు, రెవెన్యూ, నీటిపారుదల, గనులు మరియు భూగర్భ శాస్త్ర శాఖల అధికారులు సంయుక్తంగా ఈ నెల 11 నుంచి 13 వరకు ఇసుక ప్రాంతాలను పరిశీలించి నివేదికను సమర్పించినట్లు తెలిపారు.

# ఫేస్‌బుక్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలి: సీఐ శ్రీనివాస్ రెడ్డి




**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:**

సోషల్ మీడియా వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు ఫేస్‌బుక్‌ను బాధ్యతాయుతంగా ఉపయోగించాలని నాగర్‌కర్నూల్ సీఐ శ్రీనివాస్ రెడ్డి సూచించారు. నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఫేస్‌బుక్ ద్వారా సమాచారాన్ని పంచుకునే ముందు నిజానిజాలు నిర్ధారించుకోవాలని తెలిపారు. తప్పుడు వార్తలు, రెచ్చగొట్టే పోస్టులు, అసత్య ప్రచారాలు షేర్ చేయడం వల్ల చట్టపరమైన సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. వ్యక్తిగత వివరాలు, బ్యాంకు సమాచారం, ఓటీపీలు వంటి గోప్య సమాచారాన్ని సోషల్ మీడియాలో లేదా అనుమానాస్పద లింకుల ద్వారా ఎవరికీ తెలియజేయవద్దని సూచించారు. తెలియని వ్యక్తుల ఫ్రెండ్ రిక్వెస్టులను అంగీకరించే ముందు జాగ్రత్తగా పరిశీలించాలని, నకిలీ ఖాతాల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. యువత సోషల్ మీడియా వినియోగానికి పరిమితులు పెట్టుకుని చదువు, వ్యక్తిగత జీవితంపై ప్రతికూల ప్రభావం పడకుండా చూసుకోవాలని సూచించారు. సైబర్ నేరాలు లేదా సోషల్ మీడియా మోసాలకు గురైతే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌ను లేదా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని సీఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ ఎస్సై, క్లాస్‌మేట్ క్లబ్ ఫౌండర్ వాసనా రాఘవేందర్, క్లాస్‌మేట్ క్లబ్ సభ్యులు పోల శ్రీనివాసులు, రమణ, పాండు, పలువురు పోలీసులు, యువత, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## ఈసీఐఎల్ పీఎఫ్ నిధుల చోరీ నిందితుడి అరెస్ట్

**ముద్ర కాప్రా:** ఈసీఐఎల్ పీఎఫ్ ట్రస్ట్ ఖాతాల్లో భారీ మోసం వెలుగు చూసింది. కుషాయిగూడకు చెందిన ఈసీఐఎల్ ఉద్యోగి ఏ. సంతోష్ కుమార్ ఫిర్యాదు మేరకు పీఎఫ్ ట్రస్ట్ ఖాతాల నుంచి ఫోర్జరీ సంతకాలతో రూ.41 లక్షల మేర అక్రమంగా నగదు బదిలీ అయినట్లు గుర్తించారు.

విచారణలో ఈసీఐఎల్ పీఎఫ్ విభాగంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న రాజా రపు ఓంకార్ చెక్కులు దొంగిలించి, నకిలీ సంతకాలతో నగదు తన, తన భార్య ఖాతాల్లో జమ చేసినట్లు తేలింది. నాలుగు చెక్కుల్లో మూడు నగదు పరచగా, ఒక చెక్కు సంతకాల పొంతన లేక తిరస్కరించబడింది. ఈ ఘటనపై క్రైమ్ నెం.350/2026 కింద కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు రాజారపు ఓంకార్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా, కోర్టు 14 రోజుల రిమాండ్ విధించి చర్లపల్లి జైలుకు తరలించారు

## బాలానగర్ మెట్రో స్టేషన్ వద్ద గంజాయి విక్రేత అరెస్ట్



**ముద్ర, కూకట్‌పల్లి:** బాలానగర్ మెట్రో స్టేషన్ సమీపంలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడుతున్న వ్యక్తిని కూకట్‌పల్లి పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు కూకట్‌పల్లి ఎస్ఐ వి. తుకారాం సిబ్బందితో కలిసి మెట్రో పిల్లర్ నెం. 863 వద్ద తనిఖీలు నిర్వహించగా, గంజాయి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న మాదరబోయిన సాయి కుమార్ (24)ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి సుమారు 907 గ్రాముల గంజాయితో పాటు ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ప్రాథమిక విచారణలో నిందితుడు గంజాయిని ఒడిశాకు చెందిన పూర్ణ చంద్ర వద్ద కొనుగోలు చేసి తీసుకువచ్చినట్లు ఒప్పుకున్నాడు. స్థానికంగా కొందరికి అధిక ధరకు విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులకు చిక్కినట్లు వెల్లడైంది.

నిందితుడిపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కూక ట్‌పల్లి పోలీసులు తెలిపారు.

**వేపతో కలిగే అద్భుత ప్రయోజనాలు:**

వ్యవసాయంలో రక్షణ:

వేప పిండిని విత్తన శుద్ధికి, వేప కషాయాన్ని పురుగుల నివారణకు సహజమైన కీట క నాశినిగా వాడతారు. ఇది రసాయనాల వాడకాన్ని తగ్గించి, పర్యావరణానికి మరియు పంటలకు మేలు చేస్తుంది.



# పశువుల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా

**- బక్రీద్ నేపథ్యంలో జిల్లా సరిహద్దుల్లో విస్తృత తనిఖీలు**

**- ఎస్పీ అశోక్ కుమార్**



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**
రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతలు కొనసాగేందుకు, పశువుల అక్రమ రవాణా, గోవధ నివారణ పై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. జిల్లా సరిహద్దులో ఏర్పాటు చేసిన రాయపట్నం, రాజారాం పల్లె, చిల్వకోడూర్ చెక్‌పోస్టును శుక్రవారం ఎస్పీ తనిఖీ చేశారు. విధుల్లో ఉన్న పోలీస్ అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అక్రమ కార్యకలాపాలకు ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. జిల్లాలోకి ప్రవేశించే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ముఖ్యంగా పశువులను తరలిస్తున్న వాహనాల పత్రాలను పూర్తిగా పరిశీలించాలని ఆదేశించారు. ప్రతి వాహనానికి సంబంధించిన వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. పశువులను అక్రమంగా తరలించే వాహనాల తనిఖీల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యంగా వహించవద్దన్నారు. అనుమానాస్పదంగా సంచరించే వాహనాలు, వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. రాత్రి వేళల్లో మరింత అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. అక్రమంగా గోవులను రవాణా చేస్తున్నారనే పేరుతో కొందరు వ్యక్తులు లేదా సంఘాలు బృందాలుగా ఏర్పడి చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడం, అల్లర్లు సృష్టించడం వంటి చర్యలకు పాల్పడే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చట్టాన్ని అమలు చేసే బాధ్యత పూర్తిగా పోలీసు శాఖదేనని స్పష్టం చేశారు. ఎవరూ స్వచ్ఛందంగా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దన్నారు. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి చర్యలనైనా ఉపేక్షించబోమన్నారు. ప్రజలు కూడా పోలీస్ శాఖకు సహకరించి అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా, డయల్ 100 కు సమాచారం అందించాలని కోరారు. ఎస్పీ వెంట డిఎస్పీ పురుషోత్తం రెడ్డి, ధర్మపురి సీఐ రాంనరసింహ రెడ్డి, ఎస్ఐ లు మహేష్, ఉదయ్ కుమార్, కృష్ణ సాగర్, సిబ్బంది ఉన్నారు.

# ఉద్యమకారులను మోసం చేస్తున్న ప్రభుత్వం



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**
రాష్ట్రం లోని ప్రజలను మభ్యపెట్టి నట్లే తెలంగాణ ఉద్యమకారులను కూడా మాయ మాటలతో మోసం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుటిల ప్రయత్నాలు చేస్తుందని తెలంగాణ ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు గంగాధర్ చింతల ఎద్దేవా చేశారు. ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో ప్రగతి భవన్ ముట్టడికి పిలుపు నివ్వగా, ముందస్తుగా జేఏసీ నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ లకు తరలించారు. ఈ సంద ర్భంగా గంగాధర్ మాట్లాడుతూ ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని, అందులో తెలంగాణ ఉద్యమకారులకు కూడా సముచిత న్యాయం చేస్తామని హామీలు గుప్పించి గద్దెనెక్కిన ప్రభుత్వం ఇప్పటి వరకు తమ సమస్యలపై కార్యాచరణ ప్రారంభించలేదని ఆరోపించారు. గత ప్రభుత్వం మాదిరిగానే వ్యవహరిస్తే రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని స్పష్టం చేశారు. మిమ్మల్ని గద్దెనెక్కించిన తెలంగాణ ఉద్యమకారులే రేపు గద్దె దించేందుకు రోన్ముఖులౌతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇందుకు ప్రభుత్వం సిద్దంగా ఉండాలని ఆయన తేల్చి చెప్పారు.

# గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు

**- డీఈఓ దర్శనం భోజన్న**



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**
గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని డీఈఓ దర్శనం భోజన్న అన్నారు. నిర్మల్ జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం విద్యా వారోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డీఈఓ దర్శనం భోజన్న, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమంద్ ఆలీ, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈఓ భోజన్న మాట్లాడుతూ విద్యాలయం, గ్రంథాలయం ఆలయాల వంటివన్నారు. పవిత్ర స్థలాలని, జ్ఞాన కేంద్రాలని కొనియాడారు. గ్రంథాలయం ఉపయోగించుకొన్న ప్రతీ వ్యక్తి అభివృద్ధి లో ఉంటారని, ఉన్నత స్థానంలో జీవిస్తారన్నారు. కలెక్టర్ పిలుపు మేరకు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది వేల పుస్తకాలు విరాళంగా అందించారన్నారు. వాటిని పాఠశాలల గ్రంథాలయాలకు అందిస్తామన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమంద్ అలీ మాట్లాడుతూ ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక లక్ష్యం ప్రతి పౌరుడిని విద్యావంతుడిని చేయడమేనని పేర్కొన్నారు. గ్రంథాలయ మహోత్సవం నిర్వహించి విద్యార్థుల్లో పఠనాసక్తి పెంచుతామని తెలిపారు. కాగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారిణి కొత్తపల్లి విజయలక్ష్మి తమ శాఖ పక్షాన 336 పుస్తకాలు జిల్లా విద్యాశాఖ కు అందజేశారు.

# ప్లాస్టిక్ వాడితే కఠిన చర్యలు



**ముద్ర, కోరుట్ల:**
సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని కోరుట్ల మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రావు హెచ్చరించారు. కమిషనర్ శ్రీనివాస్ రావు ఆదేశాల మేరకు శుక్రవారం బల్దియా సిబ్బంది పట్టణంలోని బార్లు, పర్మిట్ రూములు, వైన్సుల్లో తనిఖీలు నిర్వహించారు. వారు వినియోగిస్తున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ స్వాధీనం చేసుకొని రూ. 17,300 జరిమానాలు విధించడంతో పాటు పాటు అవగాహన కల్పించారు. ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్ చేసుకోవాలని దుకాణ దారులకు సూచించారు. ఈ సంద ర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను పూర్తి స్థాయిలో నిషేధించాలన్నారు. లేనిచో భారీ జరిమానాలు విధించడంతో పాటు దుకాణాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. వ్యాపార కార్యకలాపాలతో వెలువడిన చెత్తను తడి, పొడి, హానికరక చెత్తగా వేరు చేసి షాప్ వద్దకు వచ్చే మున్సిపల్ వాహనాలకు అందించాలన్నారు. లేనిచో జరిమానా విధిస్తామని హెచ్చరించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రాజేంద్రప్రసాద్ , ఇంచార్జి శానిటరీ ఇన్ స్పక్టర్ అశోక్, రికార్డ్ అసిస్టెంట్ జగదీష్, ఎన్విరా న్మెంటల్ ఇంజనీర్ మహేష్, కోఆర్డినేటర్ హేమంత్, జవాన్లు విష్ణు వర్ధన్, నితిన్ పాల్గొన్నారు.

# లారీ ఢీకొని వృద్ధుడి మృతి

**ముద్ర, కోరుట్ల:**



జగిత్యాల జిల్లా లోని ఇబ్రహీంపట్నం మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన కోట రాజన్న (78) వృద్ధుడు లారీ ఢీకొని మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కోట రాజన్న ఇల్లు హైవేను ఆనుకొని ఉంది. ప్రతిరోజు ఉదయం హైవే రోడ్డు దాటి మొఖం కడుక్కోవడానికి బోరు దగ్గరికి వెళ్లుతాడు. అదే క్రమంలో శుక్రవారం ఉదయం మొఖం కడుక్కోని తిరిగి రోడ్డు దాటుతున్న క్రమంలో మెట్ పల్లి నుంచి ఆర్మూరు వైపు వెళ్తున్న లారీ అతి వేగంగా వచ్చి ఢీ కొట్టింది. దీంతో రాజన్న అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కొడుకు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై జీ. నవీన్ తెలిపారు.

# కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**
నిర్మల్ నియోజకవర్గంలోని మామడ మండలానికి చెందిన 143 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను ఎంపీ గోడం నగేష్, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో 420 హామీలు చెప్పి ఏ ఒక్కటి కూడా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. మహిళలకు ఇస్తామన్న అనేక హామీలను ప్రభుత్వం అమలు చేయకుండా మభ్యపెడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కొండ్ర రాజారెడ్డి, సత్యం చంద్రకాంత్, మండల నాయకులు బాపు రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, సర్పంచ్ సూరి, వివిధ గ్రామాల సర్పంచ్ లు, నాయకులు పాల్గొన్నారు.

# కరీంనగర్ కు మహర్దశ

**- యూసీఎఫ్ కింద మూడు ప్రాజెక్టులకు కేంద్రం సూత్రప్రాయ ఆమోదం**

**- రూ.895 కోట్ల మంజూరు ప్రతిపాదనలకు ఓకే?**

**- ఫలించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కృషి**

**- కరీంనగర్ మేయర్ పదవి బీజేపీకి అప్పగిస్తే వరద నిధులు పారిస్తానని గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన బండి**

**- ఇచ్చిన హామీ మేరకు ప్రధాని మోదీ, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రిని కలిసిన సంజయ్**

**- యూసీఎఫ్ స్కీంలో కరీంనగర్ ను చేర్చాలని విజ్ఞప్తి**

**- సంజయ్ విజ్ఞప్తికి కేంద్రం సానుకూల స్పందన**

**- వెంటనే ప్రతిపాదనలు పంపాలని రాష్ట్రాన్ని కోరిన కేంద్రం**

**- కేంద్రం సూచన మేరకు ప్రతిపాదనలు పంపిన రాష్ట్ర ప్రభుత్వం**

**- నేడు కరీంనగర్ కు రానున్న కేంద్ర అధికారుల బృందం**




**ముద్ర, కరీంనగర్:** కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కు మహర్దశ పట్టనుంది. స్మార్ట్ సిటీ పేరుతో ఇప్పటికే కరీంనగర్ కు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసిన కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం తాజాగా అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (యూసీఎఫ్) స్కీం కింద మరో మూడు ప్రాజెక్టులకు సూత్రప్రాయ ఆమోదం తెలిపింది. వీటి మొత్తం విలువ రూ.895 కోట్లు. అందులో భాగంగా పట్టణ రవాణా మెరుగుదలకు మోడల్ రోడ్లు, జంక్షన్లు, స్కైవాక్‌లు, నాన్-మోటరైజ్డ్ ట్రాన్స్‌పోర్ట్ సదుపాయాలతోపాటు ఫుట్ ఓవర్ బ్రిడ్జల నిర్మాణం, అభివృద్ధి కోసం రూ. 700 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించింది. అట్లాగే వర్షపు నీటి కాలువల నిర్మాణం, పునరావాసం, వరద నివారణ చర్యల కోసం రూ.130 కోట్లు కేటాయించనుంది. అట్లాగే కరీంనగర్‌లో సమగ్ర ఘన వ్యర్థాల నిర్వహణ రూ.65 కోట్లతో ప్రతిపాదనలను సిద్ధం చేసింది. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కు చెందిన అపెక్స్ కమిటీ ఇటీవల ఢిల్లీలో సమావేశమై ఈ ప్రతిపాదనలపై చర్చించి సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. అందులో భాగంగా కమిటీ ఆదేశాల మేరకు రేపు (శనివారం) కేంద్ర అధికారుల బ్రుందం కరీంనగర్ కు రానుంది. కరీంనగర్ లో పర్యటించడంతోపాటు స్థానిక అధికారులతో సమావేశం కానున్నారు.

### ఫలించిన బండి సంజయ్ కృషి..

యూసీఎఫ్ స్కీంలో కరీంనగర్ ను చేర్చడంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ చేసిన కృషి ఫలించింది. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కరీంనగర్ మేయర్ పదవిని బీజేపీకి అప్పగిస్తే నిధులు వరద పారిస్తానంటూ బండి సంజయ్ హామీ ఇచ్చారు. కరీంనగర్ ప్రజలు మేయర్ పదవిని కాషాయ పార్టీకి అప్పగించడంతో ఇచ్చిన నిధులు తీసుకురావడంపైనే ద్రుష్టి సారించారు. అందులో భాగంగా ఇటీవల 15వ ఆర్థిక సంఘం నిధుల కింద కార్పొరేషన్ కు రూ.10 కోట్లు మంజూరయ్యాయి. దీంతోపాటు స్మార్ట్ సిటీలో భాగంగా కార్పొరేషన్ కు రూ.70 కోట్లు వచ్చాయి. కరీంనగర్ రూపురేఖలు మార్చాలంటే ఈ నిధులు సరిపోవని భావించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఇటీవల ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్ లాల్ కట్టర్ ను కలిశారు. తెలంగాణలో ఒకే ఒక్క మున్సిపల్ కార్పొరేషన్ ను బీజేపీ కైవసం చేసుకుందని పేర్కొంటూ అభివఐద్ధిలో కరీంనగర్ ను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు తగిన సహాయ సహకారాలు అందించాలని కోరారు. అందులో భాగంగా యూసీఎఫ్ స్కీంలో కరీంనగర్ ను చేర్చాలని విజ్ఞప్తి చేశారు.

బండి సంజయ్ విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన కేంద్ర ప్రభుత్వం తగిన ప్రతిపాదనలను పంపాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. కేంద్రం లేఖను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర మున్సిపల్ శాఖ అధికారులు కరీంనగర్ కార్పొరేషన్ అధికారులతో సమావేశమై ప్రతిపాదనలను రూపొందించి కేంద్రానికి పంపారు. కేంద్రంలోని పట్టణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారుల అపెక్స్ కమిటీ రెండ్రోజుల క్రితం ఈ ప్రతిపాదనలకు సూత్రప్రాయ ఆమోదం తెలపడంతోపాటు కరీంనగర్ లో పర్యటించి ఆయా ప్రతిపాదనలపై రాష్ట్ర అధికారులతో చర్చించాలని కేంద్ర అధికారుల బ్రుందాన్ని ఆదేశించింది. కేంద్ర ఆదేశాల మేరకు అధికారుల బృందం శనివారం కరీంనగర్ లో పర్యటించనుంది. ప్రతిపాదనల్లో పేర్కొన్న ప్రాజెక్టుల నిర్మాణంపై అధికారులతో చర్చించనుంది.

# జగిత్యాల - ఆదిలాబాద్ బస్సు ప్రారంభం




**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**
జిల్లాలోని ప్రయాణికుల కోరిక మేరకు జగిత్యాల నుంచి ఆదిలాబాద్ కు ఆర్టీసీ బస్సు సర్వీసును శుక్రవారం ప్రారంభించినట్లు డిపో మేనేజర్ కల్పన తెలిపారు. ప్రతి రోజు జగిత్యాల నుంచి సారంగాపూర్, జన్నారం మీదుగా అదిలాబాద్ వరకు రెండు బస్సులు నడుస్తాయన్నారు. ఉదయం 8.20 గంటలకు జగిత్యాల నుంచి బయలుదేరి ఆదిలాబాద్ కు 12 :20 గంటలకు చేరుకుంటుందన్నారు. తిరిగి 12: 45 కు అదిలాబాదు నుంచి బయలుదేరి సాయంత్రం 4:45 నిమిషాలకు జగిత్యాలకు చేరుకుంటుందని వివరించారు. రెండో బస్సు జగిత్యాల నుంచి మధ్యాహ్నం12 గంటలకు బయలుదేరి సాయంత్రం నాలుగు గంటలకు అదిలాబాద్ చేరుకుంటుందన్నారు. తిరుగు ప్రయాణం నాలుగున్నర గంటలకు బయలుదేరి రాత్రి 8:30 గంటలకు జగిత్యాలకు చేరుకుంటందని తెలిపారు. ఈ బస్ సర్వీసులను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ కోరారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 16.05.2026
www.mudranews.in | @mudranews



## వేపతో కలిగే అద్భుత ప్రయోజనాలు

గాయాల నివారణ: చిన్న చిన్న గాయాలు లేదా పుండ్లు పడినప్పుడు వేప ఆకుల పేస్ట్‌ను రాస్తే త్వరగా నయమవుతాయి. దీనిలోని యాంటీ సెప్టిక్ గుణాలు ఇన్ఫెక్షన్ వ్యాపించకుండా అడ్డుకుంటాయి.



## 18 నుంచి యువజన వారోత్సవాలు



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగ ంగా జిల్లాలో ఈ నెల 18 నుంచి 23 వరకు యువ జ న వారోత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18న "ఫిట్ అండ్ ఆక్టివ్ తెలంగాణ మారాథోన్ అండ్ ఫిసికల్ లీటరసీ "మండల స్థాయి లో నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా స్థాయి లో రన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, భువనగిరి నుండి ఉదయం 6 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. నిర్వహించే వివిద కార్యక్రమాలకు అధిక సంఖ్య లో క్రీడ ప్రతినిధులు, యువత పాల్గొన వలసిందిగా కోరారు.

## డ్రగ్స్ అమ్ముతున్న ఇద్దరు అరెస్టు



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** డ్రగ్స్ అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ రమేష్ తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం విశ్వసనీయ సమాచారం మేరకు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో డ్రగ్స్ అమ్ముతున్నారని తెలియగా ఎస్సై లక్ష్మీనరసయ్య సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించగా ఇద్దరు వ్యక్తులు అనుమా నాస్పదంగా తిరుగుచుండగా వారిని ఆపి ప్రశ్నించిగా వారి పేర్లు జిల్లా వెస్ట్ బెంగాల్ కు చెందిన హబీబుర్రహ్మాన్ (48) మాల్డా , ఎస్.కె. ఖాదిర్ (30) తెలిపారని చెప్పారు. వారి వద్ద 50 గ్రాములు బ్రౌన్ షుగర్ ను సీజ్ చేయడం జరిగిందని దీని విలువ సుమారు 5 లక్షలు ఉంటుందని చెప్పారు. దీనిని వీరు పశ్చిమబెంగాల్, బంగ్లాదేశ్ బార్డర్ వద్ద గల మాల్డా జిల్లా నుంచి తీసుకువచ్చి ఇక్కడ అధిక లాభాలకు అమ్ముతున్నారని తెలుస్తుందన్నారు. నిందితులను రిమాండ్ కు తరలిం చినట్లు తెలిపారు.

## డిస్ట్రిక్ట్ కిక్ బాక్సింగ్ విజేతకు సన్మానం



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** తెలంగాణ స్టేట్ కిక్ బాక్సింగ్ చాంపియన్ షిప్ 2026-27 రంగారెడ్డి జిల్లా కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యం లో నిర్వహించిన (అండర్ 54 kg ) లో యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన కుంచర్ల మణిశంకర్ తృతీయ స్థానం కైవసం చేసుకోగా శుక్రవారం జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీ కే. ధనంజనేయులు తన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా తెలంగాణ బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు యాదాద్రి భువనగిరి జిల్లా కు ప్రేసెడెంట్ ఎం.రాజేందర్ , జనరల్ సెక్రెటరీ ఎం. సునీత , ట్రెసరేర్, జె .సందీప్ ను ఎంపిక చేసిన సందర్భంగా వారిని శాలువా తో సన్మానం చేశారు.

## మున్సిపల్ మాజీ చైర్మన్ జన్మదిన వేడుక

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** భువనగిరి మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్ పుట్టిన రోజు సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు హీరే కార్ శ్రీను శాలువాతో సత్కరించి, యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి లడ్డు ప్రసాదం అందజేశారు. యూత్ కాంగ్రెస్ నాయకులు కాకునూరి మహేందర్, గాజుల కృష్ణ, గుత్తి శివుడు, పుట్ట శివకుమార్, సిల్వర్ శీను, గోపే ఎల్లయ్య పాల్గొన్నారు.

# ఆదాయ వనరుల పెంపుపై దృష్టి సారించాలి

**తెలంగాణ రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య**



**ముద్ర, సూర్యాపేట జిల్లా ప్రతినిధి :** స్థానికంగా అందుబాటులో ఉన్న అన్ని అవ కాశాలను వినియోగించుకుంటూ ఆదాయ వనరులను పెంపొందించుకునే దిశగా స్థానిక సంస్థలు చిత్తశుద్ధితో కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య సూచించారు. అనవసర వ్యయాన్ని తగ్గించుకుని ఆదాయ వనరులను పెంచుకున్నప్పుడే ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ వారి జీవన ప్రమాణా లను మెరుగుపర్చే అవకాశం ఉంటుందని అన్నారు. సూర్యాపేట సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శుక్రవారం నిర్వహించిన తూర్పు తెలంగాణ ప్రాంతీయ స్థానిక సంస్థల సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్య కార్యదర్శి కాత్యాయని దేవి, సభ్యులు సుజానా యాదవ్, ఎస్. సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ జిల్లాలోని స్థానిక సంస్థల పనితీరును పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, చెత్త సేకరణ, పచ్చదనం పెంపు, పన్ను వసూళ్లు, స్వయం ఉపాధి పథకాల అమలు, గ్రాంట్లు, ఇతర ఆదాయ మార్గాలపై వివరాలు అందించారు. ఈ సందర్భంగా సిరిసిల్ల రాజయ్య మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యమే దేశ స్వరాజ్యమని గుర్తుచేశారు. గ్రామీణ ప్రజలను ప్రజాస్వామ్య పరిపాలనలో భాగస్వాములు చేస్తూ వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి స్థానిక సంస్థలు కృషి చేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పూర్తిగా ఆధారపడకుండా పన్ను వసూళ్లు, ప్రకటనల రాబడి, వృత్తి పన్ను, వ్యాపార సముదాయాల రుసుముల ద్వారా స్థానిక ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల్లో ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు, మెరుగైన పారిశుధ్య నిర్వహణ ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశిం చారు. జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ గ్రామాలు, మున్సిపాలి టీలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయం తో పనిచేయాలని కోరారు. అభివృద్ధి పనులకు అవసరమైన నిధుల కోసం ప్రజల్లో పన్నుల చెల్లింపుపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, నగర మేయర్లు, చైర్పర్సన్ లు, ఎక్స్ ఎం.పి.టి.సి.లు, ఎక్స్ జడ్.పి.టి.సి లు సర్పంచులు, మునిసిపల్ కమీషనర్ లు, డిపిఓ లు, ఎంపిడిఓ లు, ఎన్జిఓస్, సూర్యాపేట అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, నల్గొండ అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి,సూర్యాపేట జెడ్పీ సీ.ఈ.ఓ డి. శిరీష, నల్గొండ జడ్పీ సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, డీపీఓ యాదగిరి, డిఎంహెచ్వో వెంకట రమణ డీఎల్పీఓలు, ఎంపీఓలు, ఎంఈఓ లు గ్రామపంచాయతి కార్యదర్శులు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కొండపైన వర్తక సంఘాన్ని రద్దు చేయాలి



**ముద్ర, యాదగిరిగుట్ట :** యాదగిరి గుట్ట దేవస్థానం లో కొండపైన వర్తక సంఘాన్ని రద్దు చేయాలని ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కు యాదగిరిగుట్ట పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందించారు. యాదగిరిగుట్ట కొండపైన వర్తక సంఘం పేరిట దేవస్థానానికి సంవత్సరానికి 10 దుకాణాలకు కేవలం రూ.1 కోటి 68 లక్షల మాత్రమే చెల్లిస్తున్నారు. అదే ఒక సెల్ ఫోన్ కౌంటర్ టెండర్ సంవత్సరానికి రూ. 2 కోట్ల 22 లక్షల పైగా దేవస్థానానికి ఆదాయం సమకూరుతుంది. ఇదేవిధంగా ఇతర టెండర్లలో కోట్లలో ఆదాయం వస్తుంది దేవస్థానంలో ప్రతి టెండర్లు ఒక సంవత్సరం కాల పరిమితితో కొత్తవారికి ఉపాధి వ్యాపార అవకాశాలు కల్పించి దేవస్థాన ఆదాయాన్ని అభివృద్ధితోపాటు భక్తుల సౌకర్యాలు పెంచే ప్రణాళిక చేయాలి. ఒక్కరే దేవస్థానంలో దుకాణాలను కొనసాగిం చాలనీ నియమం లేదు. అందరికీ అవకాశాలు కల్పించే దిశగా టెండర్లు జరగాలి, కొండ కింద అన్నదానం కాంప్లెక్స్ వద్ద వర్తక సంఘం వారికి కేటాయిస్తూ గత ప్రభుత్వం వెసులుబాటుగా నిర్మించిన 112 షాపింగ్ కాంప్లెక్స్ టెండర్లు వేస్తే దేవస్థా నానికి ఆదాయం వస్తుంది. ప్రసిద్ధ పుణ్యక్షే త్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసిం హస్వామి వారి దేవస్థానము కొండపైన వర్తక సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న 10 దుకాణాలను రద్దుచేసి అదనంగా 30 కొత్త దుకాణాలు టెండర్లు వేయాలని స్థాని కులు వ్యాపారస్తులు నిరుద్యోగులు, బాధితు లు కోరుతున్నారు. ఈనెల 31 నాటికి కొండపైన వర్తక సంఘంలోని దుకాణాలకు గడువు ముగుస్తుంది. కాగా ప్రతి సంవత్సరం దేవస్థానం పరిధిలో టెండర్లకు 3 నెలల టెండర్ నోటిఫికేషన్ జారీ చేస్తారు. కానీ టెండర్ల సమయం దగ్గర పడ్డ ఇంతవరకు టెండర్లు వేయకపోవడం గమనార్హం. కొండపైన దుకాణాలలో ప్రకటనలు జారీ చేస్తూ పాత, కొత్త వారికి అవకాశాలు కల్పిస్తున్నారు. అందులో భాగంగా కొండపై ఉన్న దుకాణాలను కూడా టెండర్లు వేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికంగా పెద్ద ఎత్తున డిమాండ్ చేస్తున్నారు. దీని వల్ల దేవ స్థానానికి సుమారు 20 నుంచి 30 కోట్ల రూపాయల ఆదాయం సమకూరుతుంది. అంతేకాదు కొత్తవారికి అవకాశం దక్కుతుంది. యాదగిరిగుట్టలో దేవస్థానం లో కొండపై ప్రస్తుతం ఉన్న 112 దుకాణాల కుటుంబాలకి పూర్తి వ్యాపార టెండర్ల హక్కులు లేవు కదా !దేవస్థానంలో ఆదా యం పెరిగితే అభివృద్ధి భక్తుల సౌకర్యాలు పెరుగుతాయి. ఎన్నో సంవత్సరాలుగా తిష్ట వేసుకొని కొండపైన దుకాణాలు కొనసాగు తూ వర్తక సంఘం పేరిట దేవస్థాన ఆదాయాన్ని గండి కొట్టే వారి వల్ల దేవస్థాన అభివృద్ధి సాధ్యమవుతుందా..?? లేక టెండర్ల ద్వారా కోట్ల రూపాయల ఆదాయం వల్ల సాధ్యమవుతుందా ..?? కొండపై ఉన్న షాపులను టెండర్లు వేస్తే వేలాది నిరుద్యో గులకు వ్యాపారస్తులకు ఉపాధి కలుగు తుంది. అంతేకాదు కొండ కింద అన్నదానం కాంప్లెక్స్ వద్ద వర్తక సంగం వారికి కేటాయిస్తూ గత ప్రభుత్వం వెసులుబాటుగా నిర్మించిన 112 షాపింగ్ కాంప్లెక్స్ టెండర్లు వేస్తే దేవస్థానానికి ఆదాయంతో పాటు వేలాది స్థానిక నిరుద్యోగుల కుటుంబాలకు మేలు జరుగుతుంది.తరతరాలుగా కొనసా గుతున్న వ్యాపార, ఆర్థిక దోపిడిని అరిక ట్టాలంటే కొత్త వారికి అవకాశాలు కల్పించా లనేది స్థానిక ప్రజలు నిరుద్యోగులు కోరు కుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాటబత్తిని ఆంజనేయులు ఆరేస్వామి బండ రామస్వామి దండ బోయిన వీరేష్ బండి వాసు కర్రె ప్రవీణ్ బండి అనిల్ కొన్నే సంజీవ గుండ్లపల్లి లింగం కల్వకొలను సతీష్ స్వర్గం నరేష్ సుదగాని శివ తదితరులున్నారు.

# సామాజిక సేవా దృక్పథం ఉన్నవారు రెడ్ క్రాస్ లో చేరాలి

**యాదాద్రి భువనగిరి రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ జి.లక్ష్మీ నరసింహ రెడ్డి, డివిజన్ కమిటీ చైర్మన్ సద్ది వెంకట్ రెడ్డి**



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** సమాజ సేవ చేయాలని, నలుగురికి సాయం చేయాలన్న తలంపుతో ఉన్నవారు ఇండి యన్ రెడ్ క్రాస్ సొసైటీలో సభ్యులుగా చేరాలని ఆ సొసైటీ యాదాద్రి భువనగిరి జిల్లా చైర్మన్ డాక్టర్ జి.లక్ష్మీ నరసింహ రెడ్డి, డివిజన్ కమిటీ చైర్మన్ సద్ది వెంకట్ రెడ్డి కోరారు. శుక్రవారం భువనగిరిలో పాత వివేరా హోటల్ వద్ద జిల్లా రెడ్క్రాస్ కార్యాల యంలో సభ్యత్వ నమోదు స్పెషల్ డ్రైవ్ డాటా సెంటర్ ను వీరిద్దరూ కలిసి ప్రారం భించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ అంతర్జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ అయినా రెడ్ క్రాస్ లో సభ్యత్వం తీసుకుని ,తమ శక్తి మేర స్వచ్ఛంద కార్యక్రమాలలో పాల్గొనాలని, కార్యక్రమాలు నిర్వహిం చాలని పిలుపునిచ్చారు. జూన్ నెల 15 వరకు నిర్వహించే ఈ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో తమ కార్యాలయంలోనూ, ఆన్లైన్లో, ఆఫ్ లైన్ లో, సభ్యత్వాలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. మండల కేంద్రాలలో తమ జిల్లా డైరెక్టర్ల వద్ద కూడా సభ్యత్వాన్ని స్వీకరించవచ్చని వివరించారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాల రెడ్ క్రాస్ కమిటీలను ఏర్పాటు చేసేందుకు గ్రామాల లోనూ రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు చేపట్టాలని కోరారు. జిల్లా కమిటీ వైస్ చైర్మన్ దిడ్డి బాలాజీ మాట్లాడుతూ సేవా నిరతి కల వారందరూ రెడ్ క్రాస్ లో సభ్యులుగా చేరవచ్చు అని పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు రెడ్ క్రాస్ ద్వారా వారికి సేవ చేసే భాగ్యం కలుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ డైరెక్టర్లు శేక్. హమీద్ పాశ,ఎస్.ఎన్ చారి,ప్రభాకర్ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి, జంపాల అంజయ్య, రాంబాయి, డివిజన్ కమిటీ డైరెక్టర్లు,ఐలేని రాంరెడ్డి,నిమ్మయ్య,జిల్లా కార్యదర్శి క్రిస్టోఫర్,పట్టణ కమిటీ డైరెక్టర్,లావణ్య,కరిపే నర్సింగ్ రావ్,మచెందర్,రాజు పాల్గొన్నారు..

## తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా మెరుగు మధు



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా భువన గిరి పట్టణానికి చెందిన మెరుగు మధు ని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు పూస శ్రీనివాస్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భం గా పూస శీను మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వివిధ ఉద్యమకారుల సంఘాలను సమైక్యపర చడానికి, ఏకతాటిపై తీసుకొని వచ్చి మలిదశ తెలంగాణ ఉద్యమకా రులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే విధంగా ఉద్యమాన్ని ఉధృతం చేయాల్సి ఉందని అన్నారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చ డానికి ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమకారులను ఐక్యం చేసే ప్రయత్నం చేస్తానని ఈ సందర్భంగా మెరుగు మధు అన్నారు.

## జాతీయ సదస్సులో యాదగిరిగుట్ట ఈవో




**ముద్ర, యాదగిరిగుట్ట :** న్యూఢిల్లీలో నిర్వహించిన జాతీయ స్థాయి నేషనల్ అవార్డ్స్ ఫర్ ఈ- గవర్నెన్స్ 29వ జాతీయ సదస్సులో యాదగిరిగుట్ట దేవస్థానం తరఫున ఈవో భవానీ శంకర్ పాల్గొని ప్రజెంటేషన్ సమర్పించారు. ఈ సదస్సులో దేశవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ సంస్థలు చేపట్టిన డిజిటల్ సేవల పరివర్తన కార్యక్రమాలు ప్రదర్శించబడ్డాయి. మొదటి దశలో దేశవ్యాప్తంగా మొత్తం 802 అప్లికేషన్లు అందగా, వాటిలో కేవలం 32 ప్రాజెక్టులు మాత్రమే షార్ట్ లిస్ట్ చేయబడ్డాయి. ఈ ఎంపికలో తెలంగాణ రాష్ట్రం నుంచి యాదగిరిగుట్ట దేవస్థానం చోటు దక్కించుకోవడం విశేషమైన గౌరవంగా భావించబడుతోందని ఆయన అన్నారు. రెండవ దశలో భాగంగా ఏప్రిల్ 8, 9 తేదీలలో జాతీయ అవార్డుల బృందం దేవస్థానాన్ని ప్రత్యక్షంగా సందర్శించి (ఆన్-స్పాట్ స్టడీ) సమగ్ర పరిశీలన నిర్వహిం చిందన్నారు. ఈ పరిశీలన నివేదికల ఆధారంగా స్క్రీనింగ్ కమిటీ మా ప్రాజెక్టును తదుపరి దశకు ఎంపిక చేయడం, మూడవ దశలో మే 14 న దేవస్థానం బృందం ఢిల్లీకి వెళ్లి జ్యూరీ సమక్షంలో ఫైనల్ ప్రజెంటేషన్ సమర్పించిందన్నారు. ఈ ప్రజెంటేషన్ ప్రాజెక్ట్ హెడ్ ద్వారా సమగ్రంగా వివరించబడగా, జ్యూరీ సభ్యుల నుండి సానుకూల స్పందన లభించిందని యాదగిరిగుట్ట దేవస్థానం చేపట్టిన డిజిటల్ పరివర్తన కార్యక్రమాలు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం విశేషమైన విషయ మన్నారు. భక్తులకు పారదర్శకత, సౌలభ్యం, సమర్థతను అందించడంలో ఈ కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి.ఇటీవలి కాలంలో యాదగిరిగుట్ట దేవస్థానం ప్రాధాన్యం రోజురోజుకు పెరుగుతూ, "తెలంగాణ తిరుపతి"గా ఖ్యాతి గడిస్తున్న నేపథ్యంలో, ఈ జాతీయ స్థాయి గుర్తింపు దేవస్థానానికి మరింత గౌరవాన్ని తీసుకువచ్చిందన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కు వినతి



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** యాదాద్రి భువనగిరి జిల్లాలోని వికలాం గులకు ఉద్యోగ రిజర్వేషన్లు, హక్కులు, రక్షణ కల్పించాలని కోరుతూ శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ వెంకారెడ్డి, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి నర్సింహారావు లను వేరు వేరుగా కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఉదయ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు ఎం. శ్రీనివాసులు మాట్లాడుతూ బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల్లో వికలాంగులకు 4 శాతం రిజర్వేషన్లు పక్కాగా అమలు చేయాలని, ప్రైవేటు సంస్థల సీ ఎస్ ఆర్ ( కార్పోరల్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధులను దివ్యాంగుల స్వయం ఉపాధికి ఉపయోగించాలని కోరారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేష్ మాట్లాడుతూ ప్రభుత్వ/ ప్రైవేటు భవనాల ప్రధాన ద్వారం వద్ద ర్యాంపులు/లిఫ్టులు ఏర్పాటు చేయాలని, దివ్యాంగుల కొరకు ప్రతి వారం ప్రత్యేక ప్రజావాణి (గ్రీవెన్స్ డే) నిర్వహిం చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర కమిటీ సభ్యులు, కుమార్ మల్లు, రంగారెడ్డి జిల్లా జనరల్ సెక్రటరీ అంజి గౌడ్, హైదరాబాద్ వైస్ ప్రెసిడెంట్ వెంకట్ రెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లా నూతన అధ్యక్షులు జి. స్వామి, ప్రధాన కార్యదర్శి ఎస్ వెంకటేష్, వైస్ ప్రెసిడెంట్స్ ఏ. గోపాల్, ఆర్ వెంకటేష్, కోశాధికారి సత్యనారాయణ, కార్యవర్గం సభ్యులు మహేష్, రాజేష్, వెంకటేష్, మల్లారెడ్డి, సిద్దార్థ్ నాయక్, సీ.హెచ్ శివ, సాయి కుమార్, బాలరాజు, జయరాజ్ పాల్గొన్నారు.

## జిల్లా కేంద్రంలో పోలీసు విస్తృత తనిఖీలు





**ముద్ర, సూర్యాపేట జిల్లా ప్రతినిధి:** డ్రగ్స్, గంజాయి లాంటి మాదక ద్రవ్యాల నిరోధించడం లో భాగంగా జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు ఈరోజు సూర్యాపేట పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో యాంటి నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ సిబ్బంది పీఎస్ఆర్ సెంటర్, ఖమ్మం అండర్ పాస్, బస్టాండ్ ప్రాంతాల్లో ఉన్న టీ దుకాణాలు, పాన్ షాప్స్ నందు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ ఎస్ఐ లు ఏడుకొండలు, శివ తేజ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలని కలుపుతూ ప్రధాన జాతీయ రహదారిపై రవాణా పరంగా ముఖ్య కేంద్రంగా ఉన్న సూర్యాపేట పట్టణంలో మెరుగైన భద్రత కల్పించడం, డ్రగ్స్, గంజాయి లాంటి మాదకద్రవ్యాలు, నిషేధిత పదార్థాల అక్రమ రవాణా నిరోధించడం, కొత్త వ్యక్తుల కదలికలు గుర్తించడం లో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించామని అన్నారు. గంజాయి డ్రగ్స్ లాంటి పదార్థాలు అక్రమ రవాణా జరగకుండా తనిఖీలు చేశామన్నారు. మాదకద్రవ్యాలు గుర్తించే డాగ్ నార్కోటిక్ డాగ్ రోలెక్స్ తనిఖీల్లో పాల్గొని బస్సులు, అనుమానిత వస్తువులు, తనిఖీ చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 16.05.2026
www.mudranews.in | @mudranews



**వేపతో కలిగే అద్భుత ప్రయోజనాలు:**

మధుమేహ నియంత్రణ:
వేప ఆకుల రసాన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల రక్తం లోని చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. ఇది ఇన్సులిన్ సున్నితత్వాన్ని పెంచి మధుమేహ వ్యాధిగ్రస్తులకు మేలు చేస్తుంది.



# కేసుల దర్యాప్తులో వేగం పెంచాలి

**- ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు**




**ముద్ర ప్రతినిధి, మెదక్:**
కేసుల దర్యాప్తులో వేగం పెంచాలని ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. జిల్లాలోని పాపన్నపేట పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం తనిఖీ చేశారు. స్టేషన్ లోని వివిధ విభాగాలను పరిశీలించారు. రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసుల స్థితి, సీసీ కెమెరాల పనితీరు, స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, సిబ్బంది విధి నిర్వహణ తదితర అంశాలను సమీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కేసుల దర్యాప్తులో వేగం పెంచి బాధితులకు త్వరితగతిన న్యాయం అందించేలా చర్యలు తీసుకోవాలని అ సూచించారు. ప్రతిరోజు సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.ఈ తనిఖీలో డీసీఆర్బీ ఇన్ స్పెక్టర్ కృష్ణమూర్తి, పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఉన్నారు.

**పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి..**

పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ పాల్గొన్నారు. అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న గ్రేవ్, నాన్‌గ్రేవ్ , మిస్సింగ్ కేసులు, ఎన్‌బీడబ్ల్యూ, ఎస్సీ/ఎస్టీ కేసుల పురోగతిని సమగ్రంగా సమీక్షించారు. ప్రతి కేసు స్థితిగతులను తెలుసుకున్నారు. ఉత్తమ ప్రతిభ చూపిన అధికా రులకు ప్రశంసా పత్రాలు అందజే శారు. దనపు ఎస్పీ విక్రాంత్ కు మార్ సింగ్, మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐలు జార్జ్, వెంకట రాజా గౌడ్, మహేష్, రేణుక రెడ్డి, జాన్ రెడ్డి, కృష్ణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణులకు న్యూట్రిషన్ కిట్ల అందజేత



**ముద్ర ప్రతినిధి, మెదక్:** జిల్లాలోని చిలప్ చెడ్ మండల కేంద్రంలో మండలానికి చెందిన 150 మంది గర్భిణులకు శుక్రవారం రాజన్న ఫౌండేషన్ చైర్మన్, నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి మాతృదేవోభవ న్యూట్రిషన్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులకు ఆరోగ్యం, పోషకాహారం పట్ల ప్రత్యేక శ్రద్ధ అవసరమని తెలిపారు. తల్లి ఆరోగ్యంగా ఉంటేనే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. అనంతరం పలు గ్రామాల బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. రాందాస్ గూడలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాన్నికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడు పాండరి, మాజీ వైస్ ఎంపీపీ విశ్వంభస్వామి, తార విష్ణువర్ధన్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, సర్పంచ్ లు బెస్త దుర్గచలం, సుధీర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, శేషాద్రి, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టంపై అవగాహన




**ముద్ర, హైదరాబాద్:**
నిజామాబాద్ కరెక్టరేట్ లో శుక్రవారం సమాచార హక్కు చట్టంపై పీఐఓ, ఏపీఐఓ, అన్ని శాఖల అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్ డాక్టర్ జి.చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ యంత్రాంగంపై ప్రజలకు విశ్వాసాన్ని కల్పిస్తూ, పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించడమే సమాచార హక్కు చట్టం ముఖ్య ఉద్దేశమన్నారు. సమాచార కమిషనర్లు పీవీ.శ్రీనివాస్ రావు, దేశాల భూపాల్, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్యతో కలిసి చంద్రశేఖర్ రెడ్డి సదస్సులో పాల్గొని మాట్లాడారు. ప్రజాస్వామ్య దేశంలో సమాచారం అందుబాటులో ఉంటేనే ప్రజలకు ఉపయోగమని, ప్రజలు కోరిన సమాచారాన్ని వారికి తెలియజేసే బాధ్యత అధికారులపై ఉందని చెప్పారు. ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కును సమాచార హక్కు చట్టం ద్వారా కల్పించిందని గుర్తు చేశారు. ప్రభుత్వ కార్యాలయాలలో సమాచారం ప్రజలకు సంబంధించినదే అయినందున దానిని వారికి తెలపడంలో అలసత్వ వైఖరి తగదని ఆయన హితవు పలికారు.

# ధాన్యం దిగుమతిపై నిర్లక్ష్యం వద్దు

**- కలెక్టర్ ప్రతిమా సింగ్**



**ముద్ర ప్రతినిధి, మెదక్:**
ధాన్యం దిగుమతిపై రైస్ మిల్లర్లు నిర్ల క్ష్యం చేయొద్దని కలెక్టర్ ప్రతిమా సింగ్ స్ప ష్టం చేశారు. జిల్లాలో సాఫీగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ, కొనుగోలు చేసిన ధాన్యం దిగుమతులు, ఇతర అంశాలపై అదనపు కలెక్టర్ నగేష్. అదనపు ఎస్పీ విక్రాంత్ సింగ్, ఆర్డీవోలు, సివిల్ సప్లై అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పోలీస్, డిఆర్డీఓ అధికారులతో శుక్రవారం కలెక్టరేట్ నుంచి గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యం దిగుమతులలో రైస్ మిల్లర్లు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యం దిగుమతి ప్రక్రియను మిషన్ మోడ్ లో వేగవంతంగా జరగాలని ఆదేశించారు. ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ధాన్యం కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. నిబంధనల మేరకు కొనుగోలు ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ క్రమంలో జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసిందన్నారు. నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి కేటాయించిన రైస్ మిల్లులకు, గోదాములకు తరలిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో రైతులు ఇబ్బందులు పడకుండా కేంద్రాలకు వచ్చే ధాన్యాన్ని బట్టి రవాణా శాఖ అధికారులు సరిపడా వాహనాలు సమకూర్చాలన్నారు. ధాన్యం కొనుగోలు, దిగుమతి ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం రవాణా విషయంలో ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం, రవాణా, గన్నీ బ్యాగుల సరఫరా, హమాలీల ఏర్పాటు వంటి అంశాల్లో అలక్ష్యంగా వ్యవహరించ కూడదన్నారు.

**1.32 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు..**

జిల్లాలో ఇప్పటివరకు 29,670 మంది రైతుల నుంచి 1,32,992 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. 14,966 రైతుల ఖాతాల్లో రూ. 171.91 కోట్లు జమ చేశామని తెలిపారు.

## చీలపల్లిలో నాలుగు ఇళ్లల్లో చోరీ

**- పరిశీలించిన ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** పెద్ద శంకరంపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చీలపల్లిలో గురువారం అర్ధరాత్రి తాళాలు వేసి ఉన్న నాలుగు ఇళ్లల్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో ఉన్న నగదు, బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులను అప హరించినట్లు బాధితులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు చోరీ జరిగిన ఇండ్లను పరిశీలించారు. ప్రతి ఇంటిని సందర్శించి పరిస్థితులను తెలుసు కున్నారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి జరిగిన ఘటనపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులకు అండగా ఉంటామన్నారు. నిందితులను త్వరలోనే గుర్తించి అరెస్ట్ చేస్తామని భరోసా ఇచ్చారు. చోరీ ఘటనపై క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ సహాయంతో ఆధారాలను సేకరిస్తున్నామని తెలిపారు. గ్రామ పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరా ఫుటేజ్‌ను పరిశీలిస్తూ ప్రత్యేక బృందాలతో దర్యాప్తు కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా గ్రామాల్లో రాత్రి పహారాను మరింత పెంచాలని అధికారులను ఆదేశించారు. అనుమానాస్పద వ్యక్తుల సమాచారం వెంటనే పోలీసులకు అందించాలని ప్రజలను కోరారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా చోరీలు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించడం సులభమవుతుందని తెలిపారు. ఎస్పీ వెంట మెదక్ డిఎస్పీ ప్రసన్న కుమార్, సీఐలు రేణుక రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, కృష్ణమూర్తి, ఎస్ఐలు ప్రవీణ్ రెడ్డి, శంకర్, పెద్ద శంకరంపేట్ పోలీసులు, క్లూస్ టీమ్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఉత్తర తెలంగాణ వార్తలు..

# కేంద్ర మంత్రి బండి సంజయ్ తల్లికి గుండెపోటు



**ముద్ర, కరీంనగర్:**
కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తల్లి శంతల గుండెపోటుకు గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను హుటాహుటిన హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. ప్రస్తుతం గచ్చిబౌలిలోని మెడికోవర్ హాస్పిటల్ లో ఆమెకు చికిత్స కొనసాగుతోంది. వైద్యులు శకుంతలకు గుండెకు స్టంట్ వేసి అత్యవసర చికిత్స అందించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. విషయం తెలుసుకున్న బండి సంజయ్ ఆసుపత్రికి చేరుకుని తల్లి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుటుంబ సభ్యులు, పలువురు కార్పొరేటర్లు, బీజేపీ నాయకులు హైదరాబాద్ లోని ఆసుపత్రికి చేరుకుని పరామర్శించారు.

## లైబ్రరీని సద్వినియోగం చేసుకోవాలి

**ముద్ర, హైదరాబాద్:**
లైబ్రరీని విద్యార్థులు, అధ్యాపకులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందూర్ గంగాధర్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న 'ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక'లో భాగంగా చేపట్టిన ఎడ్యుకేషన్ వీక్‌లో ఐదో రోజు ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో 'మన గ్రంథాలయం, జ్ఞానోత్సవం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. ఇందూర్ గంగాధర్ మాట్లాడుతూ మన కళాశాల గ్రంథాలయంలో 9 వేల పుస్తకాలు ఉన్నాయని, డిజిటల్ లైబ్రరీ సౌకర్యం కలదని చెప్పారు. విద్యార్థినీ విద్యార్థుల కోసం ఇంగ్లీషు, తెలుగు దినపత్రికలతో పాటు అన్ని సబ్జెక్టుల టెక్స్ట్ బుక్స్, రిఫరెన్స్ బుక్స్, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు ఉన్నాయన్నారు..
దోస్త్ మొదటి ఫేజ్ అడ్మిషన్లలో జిల్లాలోనే ద్వితీయ స్థానం ఎస్ఆర్ఎన్‌కే కళాశాల సాధించిందని తెలిపారు.

# ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోదాములకు చేర్చాలి



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**
రైతుల నుంచి కొన్న ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోదాములకు తరలించాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం సారంగాపూర్ మండలం చించోలి (బి) గోదామును ఆయన పరిశీలించారు. ధాన్యం అన్లోడ్ అవుతున్న తీరును చూశారు. అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ తగినంత మంది హమాలీలతో అన్ లోడింగ్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసి, లారీలను వేగవంతంగా ఖాళీ చేయాలన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, పౌరసరఫరాల అధికారులు రాజేందర్, సుధాకర్, తహసీల్దార్ విజయ కాంతారావు, ఇతర అధికారులు తదితరులు ఉన్నారు.

## కూచన్ పల్లిలో బడిబాట



**ముద్ర ప్రతినిధి, మెదక్:** జిల్లాలోని కూచన్ పల్లి మండల కేంద్రంలో శుక్రవారం బడిబాట నిర్వహించారు. పీఎంశ్రీ ఉన్నత పాఠశాల కూచన్ పల్లి ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓ నాచారం మధుమోహన్ ఆధ్వర్యంలో బడిబాట నిర్వహించారు. ఉపాధిహామీ పథకం కూలీల వద్దకు వెళ్లి అవగాహన కల్పించారు. గ్రామంలోని విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు నడుస్తున్నాయని తెలిపారు. ప్రైవేట్ పాఠశాల వైపు మొగ్గుచూపకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలు ప్రారంభం

**ముద్ర, హైదరాబాద్:** సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం తొగుట సీఐ షేక్ లతీఫ్ ఎనిమిది సీసీ కెమెరాలను ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ అరికట్టవచ్చున్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల దొంగతనాలు, అనుమానాస్పద ఘటనలను గుర్తించే అవకాశం ఉంటుందని తెలిపారు. నేరస్తులను గుర్తించి పట్టుకోవడంలో సీసీ కెమెరాలు పోలీసులకు కీలక ఆధారాలుగా ఉపయోగపడతాయని చెప్పారు. ప్రజల భద్రత కోసం ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అవసరమని సూచించారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు. దాతలు ముందుకు వచ్చి సీసీ కెమెరాల ఏర్పాటు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com